పేజీలు :12
వెల :5/-

# మీడియా టుడే

జాతీయ తెలుగు దినపత్రిక

www.mediatodaydaily.com

మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 | సంచిక : 170 | శనివారం 4-4-2026 | పేజీలు 12 | వెల 5/-

# యుద్ధం.. ఉద్ధృతం

## తీవ్రస్థాయిలో దాడులు.. మౌలిక సదుపాయాల విధ్వంసం

**ఇరాన్‌లోని ఎత్తయిన వంతెనను పేల్చేసిన అమెరికా**

**8 మంది మృతి.. 95 మందికి గాయాలుప్రతీకారంగా పశ్చిమాసియాలోని**

**8 భారీ వంతెనలను కూల్చేస్తామని ఇరాన్ ప్రకటన**

**మరో ఎఫ్-35ను కూల్చేశామన్న ఐఆర్‌జీసీ**

**గాలింపు చేపట్టిన అమెరికా హెలికాప్టర్‌ను కూడా..!**

**ఇరాన్ సైన్యం ఆధీనంలో ఒక పైలట్?**

**బ్రిడ్జి పేల్చివేత అమెరికా నైతిక పతనానికి సాక్ష్యం**

**దౌత్యానికి తలుపులు పూర్తిగా మూసుకున్నాయి**

**ఇక చర్చలు ఉండవు: ఇరాన్ విదేశాంగ మంత్రి**

**ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలు ధ్వంసం చేస్తాం**

**హోర్ముజ్‌ను తెరిచి, చమురు స్వాధీనం చేసుకోగలం**

**ఆలస్యం కాకముందే ఒప్పందానికి రావాలి: ట్రంప్**



**వాషింగ్టన్ ఏప్రిల్ 3: మీడియా టుడే**
పశ్చిమాసియాలో యుద్ధం మరింత ఉద్ధృతం అవుతోంది. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులు జరుగుతున్నాయి. ఇరాన్‌లో వంతెనను అమెరికా పేల్చివేస్తే.. గల్ఫ్ దేశాల్లోని చమురు, విద్యుత్ ప్లాంట్లు, డీసాలినేషన్ వ్యవస్థలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అటు అమెరికా యుద్ధ విమానాన్నీ కూల్చివేసింది. దాడులు చేయబోమంటూనే అమెరికా మోసానికి పాల్పడిందని ఇరాన్ ఆరోపిస్తే... ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌లోని టెహ్రాన్ నుంచి కరాజ్ ప్రాంతాన్ని కలిపే భారీ వంతెన 'బీ1 బ్రిడ్జ్'ను అమెరికా శుక్రవారం పేల్చివేసింది. ఆ పేలుళ్ల వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఇంకా ఆలస్యం కాకముందే ఇరాన్ ఒప్పందానికి రావడం మంచిదని హెచ్చరించారు. నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్న ఈ వంతెన పశ్చిమాసియాలోనే ఎత్తయినదిగా చెబుతున్నారు. 446 అడుగుల (136 మీటర్ల) ఎత్తయిన ఈ వంతెనపై తొలుత వైమానిక దాడి చేసిన అమెరికా.. సహాయక చర్యలు కొనసాగుతున్న సమయంలో రెండో సారి బాంబులు వేసింది. ఆ సమయంలో వంతెనకు సమీపంలో పర్షియన్ కొత్త సంవత్సరం 'నౌరుజ్' వేడుకల ముగింపు కార్యక్రమం జరుగుతోంది. వందలాది మంది గుమిగూడి ఉన్నారు. దాడిలో వారిలో 8 మంది మృతిచెందగా.. 95 మందికిపైగా గాయపడినట్టు ఇరాన్ వెల్లడించింది. బ్రిడ్జి పేల్చివేత ఘటనపై తీవ్రస్థాయిలో మండిపడింది. దీనికి ప్రతీకారంగా పశ్చిమాసియాలోని ఎనిమిది భారీ, కీలక వంతెనలను పేల్చివేస్తామని ప్రకటించింది. కువైట్‌లోని షేక్ జబేర్ సీబ్రిడ్జి, యూఏఈలోని అల్ మఖ్తా, షేక్ ఖలీఫా, షేక్ జాయెద్ వంతెనలు, బహ్రెయిన్-సౌదీలను కలిపే కింగ్ ఫాహద్ కాజ్‌వే, జోర్డాన్‌లోని కింగ్ హుస్సేన్, దమియా, అబ్దౌన్ వంతెనలను కూల్చివేస్తామని హెచ్చరించింది.

**మరో ఎఫ్-35ను కూల్చేసిన ఇరాన్!**
అమెరికాకు చెందిన మరో అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఎఫ్-35 లైట్నింగ్-2ను కూల్చివేసినట్టు ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. గత 24 గంటల్లో ఇది రెండోదని, మొత్తంగా మూడో ఎఫ్-35ని అమెరికా నష్టపోయిందని పేర్కొంది. శుక్రవారం సెంట్రల్ ఇరాన్‌లోని కోహ్గిలుయే ప్రాంతంలో ఈ ఫైటర్ కూలిపోయి, భారీ పేలుళ్లు జరిగాయని తెలిపింది. అయితే అందులోని పైలట్లు ముందే ఎజెక్ట్ వ్యవస్థ ద్వారా బయటపడి నేలపై దిగారని.. వారి కోసం అమెరికా హెలికాప్టర్లు, సీ-130 హెర్క్యులస్ విమానాలు తక్కువ ఎత్తులో ఎగురుతూ గాలింపు చేపట్టాయని వెల్లడించింది. గాలింపు వీడియోలను కూడా విడుదల చేసింది. ఆ అమెరికన్ పైలట్‌ను ప్రాణాలతో పట్టిస్తే 'విలువైన బహుమతి' ఇస్తామని ఇరాన్ సైనికాధికారులు ప్రకటించారు. అయితే సదరు పైలట్లను ఇప్పటికే ఇరాన్ సైన్యం పట్టుకుందనే వార్తలూ వెలువడుతున్నాయి. ఇరాన్‌లో ఒక యుద్ధ విమానం కూలిపోయిందని, రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని అమెరికా రక్షణ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించినట్టుగా వాల్‌స్ట్రీట్ జర్నల్, సీఎన్ఎన్ తెలిపాయి. ఒక పైలట్‌ను గుర్తించి రక్షించారని వెల్లడించాయి. కూలిపోయినది ఎఫ్-15ఈ ఫైటర్ అయి ఉంటుందని.. ఎందుకంటే ఎఫ్-35లో ఒకరే పైలట్ ఉంటారని, ఎఫ్-15ఈలో ఇద్దరు పైలట్లు ఉంటారని విశ్లేషించాయి. కూలిపోయిన యుద్ధ విమానం శకలాలను, పైలట్లను గుర్తించేందుకు అమెరికా బ్లాక్ హాక్ హెలికాప్టర్, సీ-130 హెర్క్యులస్ విమానాలతో గాలింపు చేపట్టింది. ఈ క్రమంలో వాటిపైనా ఇరాన్ డ్రోన్లు, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడిలో ఒక హెలికాప్టర్ కూలిపోయిందని ఇరాన్ మెహర్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. ట్రంప్ బెదిరింపు ప్రకటనలు, మౌలిక సదుపాయాలపైనా అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో.. ఇరాన్ కూడా భారీ స్థాయిలో దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపైకి క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. కువైట్‌లోని చమురు రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడులతో భారీగా మంటలు చెలరేగాయి. దానితోపాటు ఇరాన్ క్షిపణి దాడుల్లో ఒక విద్యుదుత్పత్తి కేంద్రం, సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే డీసాలినేషన్ కేంద్రం దెబ్బతిన్నట్టు కువైట్ ప్రకటించింది.

# పాత పేరు.. కొత్త అజెండా!


**టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు**

**ప్రొ. జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం పని చేస్తాం**

**పార్టీ ఆవిర్భావం తర్వాత భారీగా చేరికలుంటాయి**

**ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకోవటం లేదు**


**ప్రైవేటు టీచర్ల హక్కుల కోసం పోరాడుతాం: కవిత**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 మీడియా టుడే**
తాను స్థాపించనున్న పార్టీకి పాత పేరు, కొత్త అజెండా ఉంటుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఖాళీగా ఉందని.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తోందని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త ఎవరూ లేరంటూ.. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఒప్పందాలు చేసుకునే పార్టీలపై పరోక్షంగా చెణుకులు విసిరారు. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల ప్రకారం తమ పార్టీ నడుస్తుందన్నారు. ఆవిర్భావ సభకు ఇతర పార్టీల నేతలను ఆహ్వానించడం లేదని, వేదికపైనే తమ అజెండా చెబుతామని, యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని కవిత వెల్లడించారు. ఎజెండా తెలియజేసిన తర్వాత పెద్దఎత్తున చేరికలు ఉంటాయని, విదేశాల్లో ఉంటున్న తెలంగాణ బిడ్డలు కూడా పార్టీలో చేరతామంటున్నారని తెలిపారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ తమకు గొప్ప అవకాశమని చెబుతూ.. సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వు అయితే వాటిలో ఒకదాన్నించి పోటీ చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నిద్రావస్థలో ఉందని, తమకు ప్రథమ శత్రువు కాంగ్రెస్సేనని.. తమ పోరాటం ఆ పార్టీపైనే ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను ఆగం చేయాలని చూస్తున్నారని, అసలు సిటీని చంపకుంటే చాలని కవిత అన్నారు. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంచేసి ఆ పార్టీని ఓడించారని.. ప్రస్తుతం కేరళలో ప్రచారం చేస్తున్నారని, అక్కడా కాంగ్రెస్‌ను ఓడిస్తారని ఎద్దేవా చేశారు. అమరావతి బిల్లు సందర్భంగా భద్రాచలం ఐదు గ్రామాల గురించి పార్లమెంటులో తెలంగాణ ఎంపీలు ప్రస్తావించాల్సి ఉండాల్సిందని, కానీ వారు పట్టించుకోలేదన్నారు.

## త్వరలోనే బీఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి..!

**హైదరాబాద్, ఏప్రిల్ 3 మీడియా టుడే**



ఇటీవల కాంగ్రెస్‌కు వీడ్కోలు చెప్పిన ఆ పార్టీ సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. స్పష్టమైన తేదీని ప్రకటించనప్పటికీ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 8న విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చిన తర్వాత ఆయనతో జీవన్‌రెడ్డి భేటీ అవుతారని తెలుస్తోంది. కారెక్కేందుకు ఆయన సిద్ధంగా ఉన్నప్పటికీ.. కేటీఆర్‌తో భేటీ తర్వాతే ఈ అంశంపై ఆయన స్పష్టతనిస్తారని సమాచారం. కుదిరితే ఈనెల రెండో వారం లేదంటే, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన 27వ తేదీన జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.


# తెలంగాణ డీఎన్‌ఏలోనే వస్త్రకళ

**దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ..**

**2047 నాటికి తీర్చిదిద్దాలన్నది లక్ష్యం**

**గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లు అభివృద్ధి చేస్తాం**

**హైటెక్స్‌లో అటెక్సకాన్- 2026 సదస్సులో రేవంత్‌రెడ్డి కీలక ప్రసంగం**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 మీడియా టుడే**
తెలంగాణను 2047 నాటికి దక్షిణాసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం ఆ రంగంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు భూమి, విద్యుత్, నీరు, తదితర మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు కల్పించడంతోపాటు వేగవంతమైన అనుమతులు మంజూరు చేస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ - 2026 (అటెక్సకాన్)లో ఆయన కీలక ప్రసంగం చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన టెక్స్‌టైల్ రంగ ప్రతినిధులకు తెలంగాణ, హైదరాబాద్ తరపున ఆయన స్వాగతం పలికారు. ఈ సదస్సులో పాల్గొంటున్నవారు కేవలం అతిథులు మాత్రమే కాదని, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు, రాష్ట్ర విజన్‌ను పంచుకునే స్నేహితులని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు తెలంగాణ బలం అని అన్నారు. పత్తి పొలాల నుంచి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ వేదికల వరకు తెలంగాణ రాష్ట్రం తనదైన ముద్ర వేసిందన్నారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాల తయారీలో గొప్ప చరిత్ర ఉందని, శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి పవిత్ర వస్త్రాలను సమర్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. వస్త్రకళ అనేది తెలంగాణ డీఎన్ఏలోనే ఉందని సీఎం రేవంత్ అన్నారు. నిజాం కాలం నుంచే ప్రపంచ వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వంటి సంప్రదాయ వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పత్తి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని, ఇక్కడ పండే పత్తి నాణ్యతకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి పేరుందని తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ రాష్ట్రానికి ప్రధాన బలంగా నిలుస్తోందన్నారు. హైదరాబాద్ గ్లోబల్ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, సినిమా రంగం, వారి ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ టెక్స్‌టైల్ నుంచే పొందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. యువతకు, ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇచ్చి, వారిలో సంప్రదాయం-ఆధునికత కలగలిపిన నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు.

# దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి

**వైసీపీ నాశనం చేస్తే.. మేం శాసనం చేశాం**

**భవిష్యత్తులోనూ ఎవరూ ఏమీ చేయలేరు**

**విమర్శలకు వెరసి వెనకడుగు వేయం**

**అత్యద్భుత, అత్యాధునిక నగరంగా నిర్మిస్తాం**

**వైసీపీ ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేసింది**

**ఏపీకి ఉనికి లేకుండా చేయాలన్నదే లక్ష్యం**

**అమరావతిని నాశనం చేయాలన్న కలలు పగటి కలలుగానే మిగిలిపోతాయి**

**2028 నాటికి ప్రధాన పనులన్నీ పూర్తి**

**2029లో మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయిస్తాం: చంద్రబాబు**



**అమరావతి, ఏప్రిల్ 3 మీడియా టుడే**
'విద్య, విజ్ఞానం, ఉద్యోగం లాంటి అంశాలకు అమరావతి నెర్వ్ సెంటర్‌గా మారుతుంది. దేశానికి ఒక ఫ్యూచర్ సిటీ అవసరం. అది అమరావతే. దేశానికి అమరావతి గర్వకారణంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సైబరాబాద్ ఈ రోజు గొప్ప స్థాయిలో ఉందంటే నాడు విమర్శలకు వెరవకుండా ముందుకు వెళ్లడమే కారణమని, ఇప్పుడు అమరావతి అభివృద్ధి విషయంలోనూ విమర్శలకు భయపడి ఆగిపోయే ప్రసక్తే లేదని అన్నారు. అత్యద్భుత, అత్యాధునిక అమరావతిని నిర్మించి తీరుతామన్నారు. 'సైబరాబాద్ సహా అమరావతిని నిర్మించే అవకాశం భగవంతుడు నాకు కల్పించాడు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా మంచి రాజధాని నిర్మించాలనే ఆలోచనతో ముందుకెళ్లాను. అమరావతిని 9 నగరాలుగా నిర్మించాలని ప్రణాళికలు రూపొందించాం. భవిష్యత్తు తరాలు శాశ్వతంగా రాజధాని ప్రాంతాన్ని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రపంచ శ్రేణి ఆర్కిటెక్ట్‌లతో డిజైన్లు రూపొందించాం. 5, 10, 15 నిమిషాల కాన్సెప్ట్ అత్యాధునిక రాజధాని నిర్మించాలనేది నా ఆలోచన. ఎమర్జెన్సీ సర్వీసులు 5 నిమిషాల్లో చేరుకునేలా.. ప్రజలకు రోజువారీ అవసరాలకు ఉపయోపడే సేవలను 10 నిమిషాల్లో అందించేలా.. కార్యాలయాలు, ఇతర పని ప్రాంతాలకు 15 నిమిషాల్లో చేరుకునేలా అమరావతి రూపకల్పన చేశాం. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు సింగపూర్ వాళ్లతో ఒప్పందం చేసుకుంటే వారిపై వైసీపీ పాలకులు అభాండాలు వేసి వెళ్లగొట్టారు. అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీశారు. నాపై నమ్మకంతో అమరావతి బాండ్లు విడుదల చేస్తే గంటలో రూ.2వేల కోట్లు వచ్చాయి. రాజధాని ప్రాంతానికి ప్రతిష్ఠాత్మక సంస్థలు విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటివి వచ్చాయి. ఆ సంస్థలు విట్ అమరావతి, ఎస్ఆర్ఎం అమరావతి అని పెట్టుకుంటే.. ఆ పేరు తీసేయమని వారిపై ఒత్తిడి చేశారు. అమరావతిపై ఎందుకంత ద్వేషం? 2014-19 మధ్య 113 సంస్థలకు 1307 ఎకరాలు కేటాయించాం. ముమ్మరంగా పనులు జరుగుతున్న సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చి వాటిని ఆపేసింది. మూడు రాజధానుల ప్రకటన చేసి వివాదాలు సృష్టించే ప్రయత్నం చేశారు. అమరావతి రైతుల ఉద్యమానికి కౌంటర్‌గా పెయిడ్ ఆర్టిస్టులతో క్యాంపులు పెట్టించారు. ఎస్సీలపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారు. నాపై రాళ్లు వేయించారు. అదేమని ప్రశ్నిస్తే.. అప్పటి డీజీపీతో భావప్రకటన స్వేచ్ఛ అని మాట్లాడించారు. 3రాజధానులు చట్టవిరుద్ధమని హైకోర్టు న్యాయమూర్తి తీర్పు ఇస్తే ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఆయన బదిలీపై వెళుతుంటే మోకాళ్లపై కూర్చుని దారంతా పూలు చల్లి వీడ్కోలు పలికారు. రాజధానిపై కుట్రలు చేసిన వ్యక్తిని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిని నియంత అనాలా లేక ఏమనాలో తెలియడం లేదు. కుట్రలు, కుతంత్రాలను ప్రజలు తిప్పికొట్టారు. మళ్లీ మాకు పట్టం కట్టారు' అని అన్నారు. 'భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది. అందుకే అమరావతికి పార్లమెంటు సాక్షిగా చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించి విజయం సాధించాం. రాష్ట్రపతి ఆమోదం తర్వాత బిల్లుకు పూర్తిస్థాయి చట్టబద్ధత వస్తుంది. అమరావతి బిల్లుకు అన్ని విధాలా సహకరించిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు 5 కోట్ల ఆంధ్రుల తరఫున ధన్యవాదాలు. లోక్‌సభ స్పీకర్‌కు, రాజ్యసభ చైర్మన్‌కు కృతజ్ఞతలు. అమరావతిని భవిష్యత్తులోనూ ఎవరూ ఏమీ చేయలేరు' అని పేర్కొన్నారు.



# హామీల అమలుపై సందేహం వద్దు

**దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే**

**పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, ఏప్రిల్ 3 మీడియా టుడే**
పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు భాగస్వాములుగా ఉన్న లౌకిక ప్రగతిశీల కూటమి (ఎస్పీఏ) అభ్యర్థులను గెలిపించాలని ఆ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. పుదుచ్చేరిలోని మనవేలి, ఎం.బాలం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ఎస్పీఏ ప్రకటించిన గ్యారెంటీలు అమలు సాధ్యమా అంటూ విపక్షాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయని, అయితే ఆ సందేహాలకు సమాధానం తెలంగాణేనని తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారెంటీల అమలు ప్రారంభించామన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణకు కాంగ్రె స్, డీఎంకే కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# ఉప్పల్ నారపల్లి కారిడార్ పేరు

## రాజకీయాలకు బలి కాకూడదు



ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి గారి పేరు పెట్టడంపై మాజీ ఎమ్మెల్యే అభ్యంతరం తెలుపడంతో ఆయన మీద విమర్శలు గుప్పించారు.కానీ ఇది కేవలం పేరు వివాదం కాదు... ప్రజల భావోద్వేగాలపై జరుగుతున్న రాజకీయ ఆట అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మండిపడ్డారు.ఇది ఒక పేరు కాదు నిలువెత్తు ఒక సేవా చరిత్ర కు నిలువెత్తు స్మారకం అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా కాప్రా లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారుదాదాపు 150 కోట్ల తో జవీ=ఖీ తో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు.మంత్రి గారితో మాట్లాడి వర్క్ మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పై నిప్పులు చెరిగారు.ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడాన్ని మాజీ ఎమ్మెల్యే వ్యతిరేకించడం పట్ల తీవ్రంగా ఖండించారు. బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు మెంబర్ గా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. ఆ సేవలకు గుర్తింపుగా ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వాజపేయి పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే అర్థరహితంగా మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు."మాకు బీజేపీపై ద్వేషం లేదు... దేశానికి సేవ చేసిన అటల్ బిహారీ వాజపేయి గారి పట్ల అపారమైన గౌరవం ఉంది. అలాంటి మహానేత పేరు పెట్టాలంటే మేమే ముందుంటాం!" అని స్పష్టం చేశారు.అయితే వెంటనే గట్టిగా హెచ్చరించారు"అందరూ మౌనంగా ఉన్నప్పుడు ఒక్కరే వ్యతిరేకించడం వెనుక ప్రజాహితం లేదు... రాజకీయ లాభాలే కనిపిస్తున్నాయి!"ఇంకా తీవ్రంగా స్పందిస్తూ"నేను ఎప్పుడూ అక్రమాలకు పాల్పడలేదు... నీలాగా పార్కులు కబ్జా నా రాజకీయాలు కావు!" అంటూ బీజేపీ మాజీ ఎమ్మెల్యేపై ఘాటు విమర్శలు చేశారు.దివంగత బండారి రాజిరెడ్డి గారి గురించి మాట్లాడుతూ ఎమ్మెల్యే గా వున్న సమయం లో స్వంత నిధులతో రోడ్లు వేయడం భవనాలు కట్టివ్వడం జరిగింది అని ఆయన అన్నారు."ప్రజల కోసం బ్రతికిన నాయకుడు... ప్రజల కోసం పోరాడిన మహానేత... అలాంటి వ్యక్తి పేరును వ్యతిరేకించడం అంటే ప్రజల మనసును అవమానించడం!" అని అన్నారు"అభివృద్ధికి రాజకీయ రంగు వేయొద్దు... ప్రజల భావోద్వేగాలతో ఆటలాడొద్దు! అధికారంలో ఉన్నా లేకపోయినా... ప్రజల కోసం నిధులు తీసుకురావడం మా బాధ్యత... మా పోరాటం ఆగదు!"అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు అన్నారు.

# దొడ్డి కొమరయ్య త్యాగం తెలంగాణ సాధనకు పునాది

## దొడ్డి కొమరయ్య 99 వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసు వులుబాసిన తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య చేసిన త్యాగం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ప్రతి ఒక్కరూ వారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు, మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు.శుక్రవారం నాడు దొడ్డి కొమరయ్య 99 వ జయంతి సందర్భంగా పండితాపురం గ్రామంలో చిత్రపటానికి మల్లి బాబు యాదవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య జనగామ జిల్లా కడవెండి గ్రామంలో 1927 ఏప్రిల్ 3న సాధారణ గొర్రెల పెంపకం దారుల కుటుంబంలో జన్మించి నిజాం జాగిర్దారుల బలవంతమైన వెట్టి చాకిరి నిర్మూలన కొరకు తెలంగాణ సాధన కోసం, జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో కేవలం 19 ఏళ్లకే చిన్న వయసులోనే ప్రాణాలను పణంగా పెట్టి తొలి అమరవీరుడ య్యాడని, నాడు ఆయన చూపిన త్యాగం మనందరకు స్ఫూర్తి అని, అందుకే మనం తెలంగాణ స్వేచ్ఛ వాయువులు పీల్చగలుగుతున్నామని, దొడ్డి కొమరయ్య ఆశయ



సాధనకు మేమంతా కట్టుబడి ఉన్నామని, వారి ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, జి. రవి చింతల పెద్ద వెంకయ్య, అల్లిక బక్కయ్య, శీలం పుల్లయ్య, పాటిబండ్ల ప్రసాదు, మల్లికార్జున్ నరేష్ నాగరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగర బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, అమరవీరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా ఖమ్మం నగర బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం అనంతరం ఖమ్మం నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్ మీడియాతో మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రాణం పెట్టిన మహానుభావుడు అని అన్నారు. నిరంకుశ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి రైతుల హక్కుల కోసం తన ప్రాణాన్ని అర్పించిన గొప్ప యోధుడు అని కొనియాడారు. తెలంగాణలో రైతులు, కార్మికులు, పేద ప్రజల కోసం పోరాడిన దొడ్డి కొమరయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. చూపిన పోరాట మార్గంలో నడుస్తూ సమాజంలో అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలని యువతకు పిలుపునిచ్చారు.అలాగే తెలంగాణలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు, నిరుద్యోగులు, పేద ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. దొడ్డి కొమరయ్య త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రజల కోసం పోరాడే ధైర్యం నాయకుల్లో ఉండాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాద జేఏసీ నాయకులు బిచ్చల తిరుమల, ఖమ్మం నగర బీసీ సెల్ అధ్యక్షుడు మేకల సుగుణరావు, మాటూరు లక్ష్మీనారాయణ, నగర ప్రచార కార్యదర్శి షకీన, బోజెడ్ల రాంమోహన్ ,బీఆర్‌టీయూ నాయకులు ఎండీవై పాషా, చిన్న మల్లేశం, కురుమ ఆరంపుల వీరభద్రం, సత్తార్ మియా, ఉస్మాన్ నెమలి కిషోర్, కుదురుపాక నర్సయ్య,రఫీ, ఆసిఫ్, మోటే కుమార్, ఫణికృష్ణ, పిడతల రామ్మూర్తి, తోడేటి లింగరాజు, మాధవి, పోలే పొంగు వెంకట్, పిట్టల తిరుమల్, సాజిద్, కొంపల్లి నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డికొమరయ్యజీవితఆశయాలనుప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**మీడియా టుడే ఖమ్మం జిల్లా ప్రతినిధి :**

దొడ్డి కొమురయ్య జీవిత ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.శుక్రవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిర స్థాయిగా నిలిచారని, వారి ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం మనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. రాజకీయ, సామాజిక రంగాలలో ఎదురైన అన్యాయాలకు



వ్యతిరేకంగా పోరాడారని, రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, తెలంగాణ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, బిసి సంఘ నాయకులు కూరాకుల నాగభూషణం, కురుమ సంఘ జిల్లా అధ్యక్షులు మాయర గంగయ్య, గౌరవ సలహాదారు చావళ్ల నాగేశ్వరరావు, కోడి లింగయ్య, చిత్తారు ఇందుమతి, గూడె మల్లయ్య, భూక్యా శోభా నాయక్, కొరిపల్లి శ్రీనివాస్, పెల్లూరి విజయ్ కుమార్, సాదిక్ అలీ, మేకల సుగుణా రావు, చావల నాగరాజు, మూడుముంతల గంగరాజు, తమ్మారపు బ్రహ్మయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ (తెలంగాణ ) ఆధ్వర్యంలో

# దొడ్డి కొమరయ్య జయంతి వేడుక

### ఎల్‌విఆర్ దళిత రత్న అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా ఇన్చార్జి



**మీడియా టుడే ఖమ్మం జిల్లా ప్రతినిధి :**

దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు ఎల్ వి ఆర్ దళిత రత్న అవార్డు గ్రహీత.బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి మేడం సీనియర్ లాయర్ మేకల సుగుణ రావు బీసీ జిల్లా అధ్యక్షులు పెరుగు వెంకటరమణ,సీనియర్ నాయకులు యాదాల నాగేశ్వరావు, సీనియర్ నాయకులు గంగయ్య యాదవ్, దళిత సీనియర్ నాయకులు రవికుమార్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కుక్కల రాములు మాదిగ జిల్లా నాయకులు పొట్ట పింజర వెంకటరత్నం మాదిగ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది.

# కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చిన రాయికల్ విద్యార్థులు



**రాయికల్-మీడియా టుడే-ఏప్రిల్ 3:**

జగిత్యాల పట్టణంలో వాకో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించబడిన జిల్లాస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ 2026-27లో కోచ్ కనుక ప్రభాకర్ వద్ద శిక్షణ పొందిన రాయికల్ కి చెందిన 23మంది విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. బొమ్మకంటి ఋగ్వేద్, కడకుంట్ల సాత్విక్, మీసరి పటేల్, చిలువేరి సమన్వి, అశ్వితనందలకు బంగారు పతకాలు...బొమ్మకంటి శ్రీయాన్, రాజారపు శివాని, రాజారపు నిత్యశ్రీ, అక్కపెల్లి అన్విత్ రెడ్డి, వేల్పుల ప్రహర్షిత, కనుక వికాన్షిలకు రజత పతకాలు... గంట్యాల హర్షిత్, బూర్గుల శ్రీకృతి, బండపల్లి ధన్యశ్రీ, బండపల్లి మనిరుద్, తాటిపాముల హార్థికసాయి, స్తంభం పావని, పడకంటి జాహ్నవి కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పతకాలతో పాటు పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు మోర సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ వార్షిక శ్వేత పత్రం విడుదల

## -హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు




**మీడియా టుడే ఖమ్మం జిల్లా ప్రతినిధి :**

ఖమ్మం ప్రెస్ క్లబ్ పాలకమండలి వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వార్షిక ఆదాయ వ్యయాలను టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రమేష్ బాబు,టి యు డబ్ల్యూ జే (ఐజేయు) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం లు వెల్లడించారుఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 వరకు ఈ 12 నెలల కాలంలో 74 ప్రెస్ మీట్ల కు గాను 1,06,500 ఆదాయం లభించిందని, వీటిలో వర్కర్ జీతం, కరెంటు బిల్లు, వాటర్ బిల్లు, మైక్ సెట్ ల కొనుగోలు, విద్యుత్ పరికరాల కొనుగోలు, ప్రెస్ క్లబ్‌కు అవసరమైన స్టేషనరీ తదితర కొనుగోళ్లకు రూ.75,756 రూపాయలు ఖర్చు అయినట్లు తెలిపారు. వీటిల్లో ఈ ఏడాది రూ.30,744 రూపాయలు మిగులు బడ్జెట్ గా లభించిందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రతి జర్నలిస్ట్ తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీలు వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేయటం పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, టి యు డబ్ల్యూ జే (టిజేఎఫ్) ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రచార కార్యదర్శి కూరపాటి నరేష్, కమిటీ సభ్యులు మురళి, ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, శంకర్, ఐజేయు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ ఫ్రైడే సందర్భంగా శాంతి నిరసన

**దళితులు మతం మారిన మాత్రాన కులం మారదు**

**భారత రాజ్యాంగంలో అంబేద్కర్ కల్పించిన హార్టికల్ 25 ప్రకారం**

**దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి**

**దళిత క్రైస్తవ హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు:**

**పాగ యోనా పిలుపు**




**ఖమ్మం ఏప్రిల్ 3మీడియా టుడే**

ఖమ్మం జడ్పీ సెంటర్ గుడ్ ఫ్రైడే సందర్భంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర దళిత క్రైస్తవుల హక్కుల కోసం శాంతి నిరసన కార్యక్రమం ఏర్పాటు. దళిత క్రైస్తవ హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పాగ యోనా మాట్లాడుతూదళిత క్రైస్తవుల హక్కుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై మీరు క్రైస్తవ మతం తీసుకుంటే రిజర్వేషన్ తీసేస్తామని సుప్రీంకోర్టు ద్వారా ఏర్పాటు చేసిన ఈ తీర్పును మేము వ్యతిరేకిస్తూ ఈనాడు దళిత క్రైస్తవులను అంటరాని వారిగా శత్రీకరిస్తూ హిందూ దేవాలయంలోనికి ఆలయ ప్రవేశం లేక ఈనాడు క్రైస్తవ మతం తీసుకుంటే మీకు రిజర్వేషన్ రాదు అని అంటున్నారు కానీ మేము హిందూ మతాన్ని వదిలి క్రైస్తవ మతాన్ని ఎందుకు స్వీకరించామో మీ అందరికి తెలుసు మేము హిందూ దేవాలయ ఆలయ ప్రవేశము లేకనే మేము క్రైస్తవ మతం స్వీకరించాము కానీ ఈనాడు భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులు ఆర్టికల్ 25 ప్రకారం మత స్వాతంత్రపు హక్కు ఉంది హక్కును కాలరాసే కుట్ర జరుగుతుందని మేము తీవ్రంగా ఖండిస్తూ ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులు క్రైస్తవ మతం మారిన కులం మారదు అది దృష్టిలో పెట్టుకొని వెంటనే దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఖమ్మం జిల్లా నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాం ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు జై భీమ్ నారమల్ల వెంకన్న, దళిత ఉద్యమ నాయకులు దాసరి శ్రీను, రాజారత్నం, కరాటే వేణు, కొట్టే విజయ్, మేకల రవి తదితరులు పాల్గొన్నారు

# వీది కుక్కల దాడిలో మరో ఘోరం

**- విచక్షణ రహితంగా పద్ద దూడ పొట్ట, చెవులు ,తోక కొరికి తినేసిన కుక్కలు**

**- ?సకాలంలో బహుళ శస్త్రచికిత్సలతో నిలిచిన దూడ ప్రాణాలు .**



**కోదాడ, ఏప్రిల్ 03 (మీడియా టుడే)-:**

వివరాల్లోకి వెళ్తే కోదాడ పట్టణం షిర్డీ సాయినగర్ లో పశు యజమాని మణికంఠ ఉపాధికోసం గేదెల్ని పెంచుకుంటున్నాడు. తెల్లవారుజామున వీధికుక్కల గుంపు మూకుమ్మడిగా నాలుగు నెలల వయస్సున్న పడ్డ దూడ పై దాడి చేసి రెండు చెవులు ,తోక తో పాటు గా పొట్ట భాగాన్ని సైతం అత్యంత క్రూరంగా, విచక్షణారహితంగా చీల్చి చర్మం , మాంసం ,సగం అరల పొట్టని కొరికి తీసేయడం తో అరల పొట్టనుండి కసరు బైటకు వచ్చి పొత్తికడుపులోకి పేరుకుపోయింది. అలా పొట్ట ఉబ్బి ఆయాసం ఒకవైపు రక్తం కారుతున్న గాయాలతో ఉన్న దూడను అత్యవసర వైద్యంకోసం ఉదయం ఏడుగంటలకే స్థానిక అసిస్టెంట్ డైరెక్టర్ కి ఫోన్ చేయగా తక్షణమే దూడను ఆసుపత్రికి తరలించమని సూచించారు.వెంటనే ప్రాథమిక పశువైద్యశాల కు చేరిన అసిస్టెంట్ డైరెక్టర్ డా పి పెంటయ్య దూడ వచ్చేసరికి శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. దూడ ఆసుపత్రికి వచ్చిన వెంటనే తొలుత పొట్టలోనుండి కసరు తొలగించి , మిగిలిపోయిన అరలపొట్ట చిందరవందర అంచులను కత్తిరించి అతికష్టం మీద కుట్లతో అరలపొట్టను అతికించారు. అనంతరం కండరాలను కలపడానికి వీలులేకుండా కుక్కలు కొరికి తినేయడంతో మిగిలిపోయిన మాంసం పీలికలను జతచేసి కుట్లు వేశారు. అలాగే కుక్కలు తినేయగా మిగిలిన చర్మాన్ని సరిచేసి పొట్టను కుట్లతో మూసివేశారు. అనంతరం కుక్కలు కొరికి తినేసిన రెండు మొండి చెవులను డ్రెస్సింగ్ చేసి కట్టు వేసి, తినగా మిగిలిన మొండి తోకకు కుట్లు వేసి విజయవంతంగా శస్త్ర చికిత్స ముగించారు. పొద్దు పొద్దున 7 గంటలకు ప్రారంభించిన దూడ ఆపరేషన్ 12 గంటలవరకు ఏకధాటిగా 5 గంటల పాటు , 5 రకాల శస్త్రచికిత్సలతో దూడకు పోస్తున్న ప్రాణాన్ని. వైద్యం కోసం వచ్చిన జంతు యజమానులు అబ్బురంగా తిలకించారు. అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ పశువుల యజమానులు పశువులను కొట్టాల్లోనే కొట్టివేయాలని, కుక్కల అరుపులు వినిపిస్తే తక్షణమే చేతి కర్రల రక్షణ సహాయంతో బైటకు రావాలని, అలాగే వీది కుక్కలకు ఇండ్లముందు ఆహారం ఇవ్వకూడదని, ఎవరైనా కుక్కలకు ఆహారం ఇవ్వాలని అనుకుంటే ఊరికి దూరంగా ఖాళీ ప్రాంతాల్లో ఏర్పాటు చెయ్యాలని సూచించారు.శస్త్రచికిత్స లో కోదాడ మండల పశువైద్యాధికారి డా విజయ మధు, సంచార పశువైద్యశాల పశు వైద్యాధికారి డా వినయ్ సిబ్బంది కరుణ్, రాజేష్ పాల్గొన్నారు

# యస్‌బిఐటి లో అట్టహసంగా ఆరోహన్ - 2026

**-ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు**

**-ముఖ్య అతిధిగా హాజరైన డి.ఆర్.డి.ఒ. డి.జి.యమ్. రామస్వామి**



**మీడియా టుడే ఖమ్మం జిల్లా ప్రతినిధి :**

ఖమ్మం యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆరోహన్ - 2026 విద్యార్థుల కేరింతల నడుమ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో 40 కి పైగా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి వాటి పనితీరు గురించి పూర్తిగా వివరించారు. తొలుత ఆరోహన్ కార్యక్రమాన్ని డి.ఆర్.డి.ఒ. డి.జి.యమ్., భారత్ డైనమిక్స్ లిమిటెట్ డిప్యూటి జనరల్ మేనేజర్ రామస్వామి సౌందర్యరాజన్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా స్వాగత నృత్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ ప్రస్తుత కృతిమ మేధస్సు యుగంలో ఉద్యోగభద్రత, ఉద్యోగాలపై ఆందోళన ఉన్న నేపధ్యంలో కృతిమ మేధస్సుకు సరియైన సమాధానం మానవ మేధస్సే అని అన్నారు. మానవ మేధస్సును ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేస్తే విద్యార్థుకు ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రస్తుత యుగంలో డ్రోన్ టెక్నాలజి బహుళప్రయో జనాలను సమకూరుస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అంశంపై దృష్టి సారించి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నూతన ఆవిష్కరణల కోసం ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు చేసామని తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాకధాన్, ఐడియాధాన్ వంటి పోటీలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధిస్తూన్నారని తెలిపారు. దీనికంతటికి రోజురోజుకి మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తాము శిక్షణను ఇవ్వడమే కారణమని తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మట్లాడుతూ విద్యార్థులు వారి సొంత ఆలోచనలతో భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే నూతన ఆలోచనలతో ఆరోహన్ 2026 సందర్భంగా ప్రాజెక్ట్ ఎక్స్‌ఫోలను ప్రదర్శించటం కళాశాలకు గర్వకారణమన్నారు. వైస్‌ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ రోబోటెక్నాలజీలో ఈ ఆరోహన్ ప్రారంభ ఉత్సవాలు నిర్వహించడం కళాశాలకు ఉన్న సాంకేతిక సత్తాను తెలియచేస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోహన్ 2026 టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా ఇతర కళాశాలల నుండి సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని పోటీతత్వాన్ని చాటారన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధాన చేసారని ఆయన వెల్లడించారు.

**ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో:**

ఆరోహన్ 2026 టెక్నికల్ ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 40 ప్రాజెక్టులు అతిధులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థుల వివరణలో ప్రారంభం నుంచి ఏవిధమైన టెక్నికల్ విధానాన్ని అవలంభించారో వంటి వివరాలు అతిధులు తెలుసుకొని వారిని అభినందించారు.అనంతరం వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో జరిగిన సాంకేతిక పోటీలైన కోడ్ డిబగ్గింగ్, సర్క్యూట్రిక్స్, క్విజ్, యంగ్ మేనేజర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:**

ఖమ్మం, యస్.బి.ఐ.టి. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆరోహన్ టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా క్లాసికల్, వెస్టన్, బ్రేక్ తదితర నృత్యాలు ప్రదర్శించి చూపరులను మైమరింపచేసారు. అదేవిధంగా గ్రూప్ డ్యాన్స్‌లతో కూడా విద్యార్థులను హోరెత్తించారు. మొత్తం మీద ఆరోహన్ 2026 కార్యక్రమం విద్యార్థుల కేరింతల నడుమ వారికి ఆనందాన్ని ఇస్తూ ముగిసంది. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉంది

**ఆరు గ్యారెంటీలను ఎన్ని ఇబ్బందులచ్చినా అమలు చేస్తున్నాం**

**గత పది ఏళ్ల టిఆర్ఎస్ పాలల్లో రాష్ట్ర అప్పుల కుప్పగా మారింది**

**పార్టీలో కష్టపడ్డ వారికి పార్టీ పదవులు ఇస్తుంది**

**సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనతోనే విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి**

**మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో మంత్రుల స్పష్టీకరణ**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి తేళ్ల విజయ్ /**
**మీడియా టుడే ,ఏప్రిల్ 3 2026:**

మంచిర్యాల జిల్లా పెల్లి లోని ఎంఎన్ఆర్ గార్డెన్లో జిల్లా స్థాయి కాంగ్రెస్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ,కార్మిక మైనింగ్ ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ,జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసిసి సెక్రెటరీ సచిన్ సావాద్ పాల్గొనగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండేవిటల్ ,మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ లు హాజరయ్యారు. మొదట మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి తోపాటు నూతన కార్యవర్గ సభ్యులతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని పార్టీలో సీనియార్టీ ప్రతిపాదికనే పదవులు ఇస్తుందని, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. అన్ని పార్టీల్లో గ్రూపు రాజకీయాలు సహజమని, అవన్నీ పక్కనపెట్టి పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. టిఆర్ఎస్ పార్టీ పదేళ్లు చేసినా అరాచకాలు ,కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పి కొట్టారు. గత పదేళ్ళ బిఆర్ఎస్ పాలల్లో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని మండిపడ్డారు. కాలేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకాల్లో భారీ స్కాం జరిగిందని, వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి అప్పుల రాష్ట్రంగా మార్చిందని మండిపడ్డారు.ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఇచ్చిన 6 గ్యారంటీల ను అమలు చేస్తున్నామని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కూడా సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామని, గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను వాస్తవాలను కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. రాహుల్ గాంధీ సోనియా గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని, కాంగ్రెస్ పార్టీ కోసం ఇందిరా గాంధీ ,రాజీవ్ గాంధీ ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు .పార్టీలో కష్టపడ్డ వారికే పదవులు రావాలని పార్టీ గుర్తింపు ఇస్తుందని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.టీ పీ సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ టిఆర్ఎస్ నిర్బంధ పాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారని, అక్రమ కేసులు అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల వల్లనే ఈరోజు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, దేశంలో కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉందని అన్నారు. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేయలేని అప్పులను పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం చేసి పెట్టిందని, కేసీఆర్ హయాంలో 8 లక్షల అప్పులు దాటి చేశారని, ఆ అప్పులకు ఒకపక్క ఇంకా వడ్డీలు కడుతూనే ,మరోపక్క సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మోసం చేసిందని, బీద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ బిజెపి ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ఎద్దేవ చేశారు. కుటుంబం లో తగాదాలు జరుగుతున్నాయని, ఇది ప్రజలు గమనిస్తున్నారని కులమతాలను రెచ్చగొడితే బీజేపీ పార్టీకి తెలంగాణలో అవకాశం లేదని హెచ్చరించారు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వాన్ని రిపేర్ చేస్తున్నామని, త్వరలోనే ప్రభుత్వాన్ని గాడిలో పెడతామని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల తోనే విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని సమావేశంలో కార్యకర్తలకు ఉద్బోధించారు.

# ఆకారం గ్రామంలో పురాతన సూర్య దేవాలయం

# శివాలయం సందర్శన పునరుద్ధరణకు హామీ, అభివృద్ధికి విరాళం



నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో సుమారు ఎనిమిది వందల ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయుల కాలం నాటి పురాతన సూర్య దేవాలయం మరియు గ్రామంలోని శివాలయాన్ని ఈరోజు ప్రముఖ వాస్తు ప్లానర్ & బిల్డర్ జూపల్లి రవీందర్ గారు, హైకోర్టు అడ్వకేట్ వై. కరుణాకర్ రెడ్డి గారు, విశ్వ హిందూ పరిషత్ నకిరేకల్ కేతెపల్లి శాలిగౌరారం మండలాల ప్రఖండ అధ్యక్షుడు పైళ్ల వీరమన్మథ రెడ్డి గారు కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి పురాతనమైన సూర్య దేవాలయం పునరుద్ధరణ కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని శివాలయం అభివృద్ధి కోసం జూపల్లి రవీందర్ గారు రూ.25,000 ఆర్థిక సహాయం ప్రకటించారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రపంచానికి ఆదర్శమని, అలాంటి గొప్ప చారిత్రక ఆధ్యాత్మిక దేవాలయాలు శిధిలావస్థలో ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ఈ వారసత్వాన్ని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ సందర్భంగా సూర్య దేవాలయం పునరుద్ధరణ కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తున్న ఆకారం గ్రామ మాజీ సర్పంచ్, శాలిగౌరారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి గారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు యంపల్ల పురుషోత్తం రెడ్డి, విద్యావేత్త కప్పల రమేష్, మద్రి ఉపేందర్, సామాజిక ఉద్యమకారుడు వేముల శ్రీను, ఆకారం గ్రామ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిమ్మనగోటి నరేష్, దేవాలయ కమిటీ సభ్యులు వలిశెట్టి కోటయ్య, ఐతగోని గణేష్, బొడ్డు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విచారణ పేరుతో ఇంకెన్ని రోజులు కాలయాపన

**మణుగూరు ఓసీ-2 ప్రమాదం... సానీ కంపెనీ విశ్లేషణ ఏంటి**

**బాధ్యత ఎవరిది? ప్రమాదాల నివారణకు కార్మికులకు ఏం భరోసా ఇస్తారు**

**ప్రమాద ఘటనపై వివరణ ఇవ్వడానికి అందుబాటులోకి రాని ఓబి కంపెనీ మేనేజర్**















**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో వాసు,ఏప్రిల్03(మీడియా టుడే):** సింగరేణి,మణుగూరు ఓపెన్‌కాస్ట్-2 గనిలో జరిగిన డంపర్ టైర్ పేలుడు ప్రమాదం సాధారణ ఘటన కాదని ఐతే ఈ ప్రమాదానికి కారణం నిర్లక్ష్యమే ప్రధాన కారణమనే అనుమానాలు బలపడుతున్నాయి.స్వయంగా మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ ఈ ప్రమాదంపై ప్రాథమిక సమాచారం ఇస్తూ.. తన 35 సంవత్సరాల అనుభవంలో ఇటువంటి ప్రమాదం జరగలేదని అన్నారు.ప్రమాదంపై ముఖ్యంగా వాహనానికి సంబంధించిన కంపెనీ ఏమి చెబుతోంది? వాహనాన్ని తయారు చేసిన సంస్థ లేదా నిర్వహణ బాధ్యతలు చూసే ఇంజినీర్లు ఈ ప్రమాదంపై ఎలాంటి ప్రాథమిక నివేదిక ఇచ్చారు? ట్యూబ్ పేలడానికి సాంకేతిక కారణాలేమిటి? మెయింటెనెన్స్ లోపమా? లేక మానవ తప్పిదమా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టత లేకపోవడం గమనార్హం.నేటికీ ప్రమాదానికి సంబందించిన విచారణ కొనసాగుతుందని మాత్రం ఇటు సింగరేణి అటు ప్రైవేట్ కంపెనీ యాజమాన్యాలు చెబుతున్నాయి.ఇక కంపెనీకి చెందిన ఇంజినీర్లు ఈ ఘటనను ఎలా విశ్లేషించారు అన్నదీ కీలక అంశంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే సాంకేతిక బృందం సంఘటన స్థలాన్ని పరిశీలించిందా? టైర్ నాణ్యత, వాహన స్థితి, నిర్వహణ రికార్డులను పరిశీలించారా? అనే విషయాలపై అధికారిక సమాచారం బయటకు రాలేదు. ఈ నేపథ్యంలో కంపెనీ వైపు నుంచి పూర్తి నివేదిక రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**మీడియాకు అడ్డుకట్ట ఎందుకు?**

ఇదిలా ఉండగా, ప్రమాదం జరిగిన ప్రదేశానికి మీడియాను అనుమతించకపోవడం కూడా విమర్శలకు దారితీస్తోంది. గనిలో భద్రతా కారణాలను చూపుతూ మీడియా ప్రతినిధులను లోపలికి అనుమతించకపోవడం, ఉన్నతాధికారుల అనుమతి అవసరమని చెప్పి వారిని బయటే నిలిపివేయడం పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రమాద స్థితిగతులు ప్రజలకు తెలియకుండా ఉంచేందుకు ప్రయత్నం జరుగుతోందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, అనుమతి కోసం వేచి చూడాల్సి రావడం పరిస్థితి తీవ్రతను మరింత పెంచుతోంది. ఇది కేవలం భద్రతా చర్యలా? లేక సమాచారాన్ని దాచిపెట్టే ప్రయత్నమా? అనే చర్చలు కూడా వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ప్రమాదంపై జరుగుతున్న........ విచారణను త్వరితగతిన పూర్తి చేసి, అసలు కారణాలను ప్రజలకు వెల్లడించాలని కార్మిక సంఘాలు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాద తీవ్రత, బాధ్యులపై చర్యలు, భవిష్యత్తులో తీసుకునే భద్రతా చర్యలపై పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మొత్తానికి, మణుగూరు ఓసీ--2 ప్రమాదం కేవలం ఒక ఘటనగా కాకుండా, పారదర్శకత, భద్రతా ప్రమాణాలు, యాజమాన్య బాధ్యతలపై పెద్ద చర్చకు దారితీస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజాలను బయటపెడతారా? లేక ఈ ఘటన కూడా అనుమానాలను నివృత్తి చెయ్యకుండానే ట్యూబ్ పేలిప్రమాదం జరిగింది అనేలా మిగిలిపోతుందా అన్నది వేచి చూడాల్సిందే.

**ఓబీ వాహనాలపై నియంత్రణ,కాంట్రాక్ట్ వాహనాల పర్యవేక్షణ ఎవరిది?**

**బాధ్యత ఎక్కడ?**

ఓబీ కంపెనీలలో,సింగరేణి అనుబంధ సంస్థల కాంట్రాక్ట్ వాహనాల పనితీరును అసలు ఎవరు పర్యవేక్షిస్తున్నారు? ఈ వాహనాల నిర్వహణ, ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై బాధ్యత ఎవరికి చెందుతుంది అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాంట్రాక్ట్ కంపెనీలదే బాధ్యతనా? లేక సింగరేణి యాజమాన్యానికి కూడా సమాన బాధ్యత ఉందా? సరైన పర్యవేక్షణ లేకపోవడం, నియమిత తనిఖీలు జరగకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రతపై స్పష్టమైన బాధ్యతలు నిర్ణయించకపోతే ఇటువంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశముందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఫిట్‌నెస్ లేని సానీ డంపర్ల నిలిపివేత... మణుగూరులో మైన్స్ సేఫ్టీ కఠిన చర్యలు.**

ప్రమాదం నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ దిలీప్ కుమార్ చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, అనుమతులు లేని సుమారు వందకు పైగా సానీ డంపర్లను నిలిపివేశారు. సెకండ్ షిఫ్ట్ బ్లాస్టింగ్ అనంతరం పరిశీలనలో మొత్తం వాహనాల్లో కేవలం 35 డంపర్లకే ఫిట్‌నెస్ ఉన్నట్లు గుర్తించగా, మిగిలిన వాహనాలను పూర్తిగా యార్డులో నిలిపివేశారు. ఓబీ వర్కర్ మృతి చెందిన ఘటన నేపథ్యంలో భవిష్యత్తులో ప్రమాదాలు పునరావృతం కాకుండా వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, హాల్ రోడ్లు, లైటింగ్, వాటర్ స్ప్రేయింగ్ వంటి భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కోల్ మైన్స్ రెగ్యులేషన్స్-2017 ప్రకారం సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్లను పాటిస్తూ రోజువారీ పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని ఓబీ కంపెనీతో పాటు సింగరేణి యాజమాన్యానికి లిఖితపూర్వక సూచనలు ఇచ్చినట్లు సమాచారం.

**మైన్స్ సేఫ్టీ రాకముందే రవాణా శాఖ ఎక్కడ?**

**గనుల్లో వాహనాలపై ఆర్టీఓ పర్యవేక్షణపై ప్రశ్నలు.**

**ఫిట్‌నెస్ లేని వాహనాలు ఎలా నడుస్తున్నాయి?**

**రెగ్యులర్ తనిఖీలు లేకపోవడంపై అనుమానాలు.**

ప్రమాదం జరిగిన తర్వాతే మైన్స్ సేఫ్టీ అధికారులు రంగంలోకి వచ్చి చర్యలు తీసుకోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. అంతవరకు రవాణా శాఖ అధికారులు ఎక్కడ ఉన్నారు? గనుల్లో తిరుగుతున్న భారీ వాహనాలపై ఆర్టీఓ అధికారులు పర్యవేక్షణ చేయరా? ఫిట్‌నెస్ లేని వాహనాలు ఎలా నడుస్తున్నాయి? రెగ్యులర్ తనిఖీలు జరుగుతున్నాయా? లేక కేవలం ప్రమాదం జరిగిన తర్వాతే చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గనుల్లో నడుస్తున్న అన్ని వాహనాలకు ఫిట్‌నెస్, అనుమతులపై సంయుక్తంగా మైన్స్ సేఫ్టీ-రవాణా శాఖలు సమన్వయంతో తరచూ తనిఖీలు నిర్వహించాలి. ప్రతి వాహనానికి డిజిటల్ ఫిట్‌నెస్ ట్రాకింగ్ విధానం అమలు చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను వెంటనే నిలిపివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు నివారించాలంటే రవాణా శాఖ కూడా సమాన బాధ్యతతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

**బాధ్యత వహించాల్సిన వారు అందుబాటులో లేరు.**

**వివరణ ఇవ్వకుండా ...విచారణలో ఉన్నాం అంటూ తప్పించుకుంటున్న ఓబీ కంపెనీ మేనేజర్.**

ప్రమాద ఘటనపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన సమయంలో ఓబీ కంపెనీ మేనేజర్ అందుబాటులోకి రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రమాదానికి అసలు కారణాలు ఏమిటి? భద్రతా లోపాలు ఎక్కడ జరిగాయి? అనే అంశాలపై స్పష్టత లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.బాధ్యత వహించాల్సిన అధికారులు ముందుకు రాకపోతే నిజాలు బయటపడతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ ఎప్పటికి పూర్తవుతుంది? బాధ్యులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? అనే ప్రశ్నలకు సమాధానంఎప్పుడు?ఘటనపై పూర్తి నివేదికను త్వరితగతిన విడుదల చేసి ప్రమాదాయానికి గల కారణాలు వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

## ఖమ్మం జిల్లా కార్యదర్శి సగ్గుర్తి నారాయణను సన్మానించిన మంగళంపూడి

**అంచలంచెలగా ఎదుగుతూ ఉన్నత పదవులు చేపట్టాలి**

**ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ మంగళపూడి వెంకటేశ్వర్లు**



**మీడియా టుడే మధిర:** కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన కార్యకర్తలను గుర్తించి వారి సేవలు మరింత బలోపేతంగా వాడుకునేందుకు జిల్లాస్థాయి పదవులను కట్టబెట్టిందన్నారు. ఎర్రుపాలెం మండలం పెగళ్లపాడు గ్రామానికి చెందిన మాజీ కాంగ్రెస్ సర్పంచి సగ్గుర్తి వెంకటనారాయణ ను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ఎన్నుకొని ఆయన స్థాయిని పెంచిందన్నారు. ఆయన జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనందుకు ఖమ్మం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ మంగళపూడి వెంకటేశ్వర్లు ఆదివారం నారాయణను శాలువతో సత్కరించి అభినందించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయికి కాంగ్రెస్ పార్టీ నియమించడం సంతోషదాయకమని ఈ క్రమంలోనే అంచలంచగా ఎదుగుతూ ఇంకా ఉన్నత పదములను చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సత్కార కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకర్లమూడి అనిల్ వారి మిత్ర బృందం పాల్గొన్నారు

## ది మాస్టర్‌మైండ్స్ స్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభం

**మహబూబ్‌నగర్ మీడియా టుడే ప్రతినిధి:**





మహబూబ్‌నగర్‌లోనిమార్లు క్రిస్టియన్‌పల్లి రోడ్, మహాలక్ష్మి టవర్స్ ఎదురుగా, పిల్లి శంకరయ్య గారి ఇంటి సమీపంలో మాస్టర్‌మైండ్స్ స్కూల్ ఘనంగా ప్రారంభిం చబడింది. ఈ కార్యక్రమాన్ని చైర్మన్ డా. రాజు సంగాని ప్రారంభించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహ్మద్ తాఖ్నెద్దీన్ , ఎన్.పి. వెంకటేష్ , కార్పొరేటర్ ఆనంద్ గౌడ్ , కార్పొరేటర్ మహ్మద్ సల్మాన్ , కార్పొరేటర్ శబ్బీర్ , AIMIM జిల్లా అధ్యక్షుడు మహ్మద్ హాది గారు, ఏఐఎంఐఎం నాయకులు మహ్మద్ జహంగీర్ , మహ్మద్ సాదాతుల్లా , మహ్మద్ అబ్దుల్ రహేల్ సలీమ్, మహ్మద్ ఫరూక్ , రఫీ ఉల్లా బేగ్ టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి అనేక మంది తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు హాజరయ్యారు.ఈ సందర్భంగా శాద్‌నగర్, కొస్గి, దేవరకద్ర బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మరియు అకాడమిక్ ప్రదర్శనలు అద్భుతంగా నిలిచాయి.చైర్మన్ మాట్లాడుతూ, తమ ప్రత్యేక సిగ్నేచర్ ప్రోగ్రామ్‌ల ద్వారా మహబూబ్‌నగర్ విద్యా రంగాన్ని పూర్తిగా మార్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అనేక మంది తల్లిదండ్రులు స్కూల్ పాఠ్యాంశాల గురించి ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నారు.ఈ ప్రారంభోత్సవంలో ముహమ్మద్ ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసే నాణ్యమైన విద్యను అందిస్తామని గర్వంగా ప్రకటించారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**మహదేవపురం నుంచి బయ్యారం వరకు కొనసాగిన సిలువ యాత్ర**



**మీడియా టుడే మధిర:** మానవాళి పాప విమోచన కోసంలోక క్షేమం కోసం తన ప్రాణాన్ని అర్పించిన ప్రేమాస్వరూపుడు దైవ కుమారుడు ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని స్మరించుకొనే అత్యంత పవిత్రమైన దినమే గుడ్ ఫ్రైడే అని బయ్యారం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఇమ్మానియేల్ ప్రబోధించారు. శుక్రవారం దేశవ్యాప్తంగా క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మధిర పురపాలక లోని పలు గ్రామాలైన మహాదేవపురం, ఇల్లూరు, దేశినేనిపాలెం, మడుపల్లి ,బయ్యారం విచారణ గురువులు ఆధ్వర్యంలో ఆర్ సి ఎం సంఘస్తులు శిలువయాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. ఏసుక్రీస్తు సిలువ యాత్ర దృశ్యాలు కనులు కట్టినట్లు చూపించారు.ఫాదర్ మాట్లాడుతూ సమస్త మానవాళి ఏసుప్రభు యొక్క మార్గంలో నడుస్తూ ప్రజలందరూ కూడా శాంతి సమాధానం తో మెలగాలని, ఇరుగుపొరుగు వారితో ప్రేమ ఆప్యాయతలతో తమ జీవితాన్ని కొనసాగించుకోవాలని ఆయన ఉపదేశించారు. కార్యక్రమంలో సంఘ కాపరులు చిలకపత్తిని కిరణ్, చిలకపత్తిని కళ్యాణ్, గుంజ సునీల్ అన్ని గ్రామాల దీక్షపరులు, సంఘస్తులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ సెంట్రల్, స్టేట్ జనరల్ బాడీ మీటింగ్




**మీడియా టుడే ఖమ్మం జిల్లా ప్రతినిధి :**

హైదరాబాదులో సురవరం ప్రతాపరెడ్డితెలుగుయూనివర్సిటీలో తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ సెంట్రల్ యూనియన్ స్టేట్ జనరల్ బాడీ మీటింగ్ ఈరోజు ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశాన్ని స్టేట్ ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ ఎండీ అబ్దుల్ ఫరూక్ అహ్మద్ మరియు స్టేట్ జనరల్ సెక్రటరీ సయ్యద్ నైముద్దీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ రియాజ్ అహ్మద్, లైబ్రరీ చైర్మెన్ కూడా పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు శ్రీనివాసరావు , రాష్ట్ర అధ్యక్షుడు, టి జి ఓ స్ సెంట్రల్ , హైదరాబాద్ మరియు సెక్రటరీ జనరల్, టీజీజాక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విభాగంలో పనిచేస్తున్న మైనారిటీ ఉద్యోగులు అందరూ ఏకతాటిపైకి రావాలని, ఐక్యంగా ఉంటేనే ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. మైనారిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ లో సభ్యత్వం తీసుకొని మైనారిటీ ఉద్యోగుల అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా టి ఎస్ –మెసా గౌరవ సలహాదారులు మహమ్మద్ సలీం , అధ్యక్షులు మొహమ్మద్ అస్లాం ఖాన్ , జనరల్ సెక్రటరీ సయ్యద్ ఏ జిల్లాని , అసోసియేట్ ప్రెసిడెంట్ యాహు పాషా , వైస్ ప్రెసిడెంట్లు ఎం.ఏ గఫూర్ , షేక్ సమద్ , జాయింట్ సెక్రటరీ ఎస్.కే జానీమియా తదితరులు పాల్గొన్నారు. సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సమస్యలు మరియు భవిష్యత్ కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు నడవాలి

## సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో మీడియా టుడే ఏప్రిల్ 03:**

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి తో ప్రజలు అందరూ ముందుకు నడవాలని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం రోజు యాదవ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కొమురయ్య జయంతి నీ పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నాడు ఈ ప్రాంతం లో బువ్వ కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటం ను చరిత్ర మరిచి పోదు అన్నారు. దొరలు, భూ స్వాముల దౌర్జన్యాలకు ఎదురు తిరిగి దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం నేటి తరానికి తెలుపాలని కోరారు. కొడకండ్ల మండల కేంద్రం లో దొడ్డి కొమురయ్య విగ్రహం ను ఏర్పాటు కోసం స్థానిక



ఎమ్మెల్యే యశ్వస్విని రెడ్డి సహకారం తో కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో యాదవ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 6న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా జయప్రదం చేయండి

### మొక్కజొన్న,ధాన్యంకొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి

### 25 క్వింటాళ్ల నిబంధనలు ఎత్తివేయాలి తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు

**నేలకొండపల్లి ఏప్రిల్ 3 మీడియా టుడే**






రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ తక్షణమే పరిష్కరించాలని, మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6 వ తేదీన తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలోని కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నేలకొండపల్లిలోని స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవనంలో తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ జనరల్ బాడీ సమావేశం సంఘం డివిజన్ అధ్యక్షుడు బిక్కసాని గంగాధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ఆరుగాలం కష్టించి అనేక వ్యయ ప్రయాసలు కోర్చి పంటలు పండించిన రైతులకు తగిన గిట్టుబాటు ధరలు చెల్లించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులతో అవస్థలు పడుతున్న అన్నదాతలకు సకాలంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలో మోసపోతున్నారన్నారు. పంటలు చేతి కళ్ళు పది రోజులు కావస్తున్న కొనుగోలు కేంద్రాల జాడ లేకపోవడంతో రైతులు గత్యంతరం లేక దళారులను ఆశ్రయించి అందిన కాడికి తెగ నమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో క్వింటా మొక్కజొన్నలు 2300 రూపాయలు, ధాన్యం 2400 రూపాయలకు అమ్ముకోగా నేడు కేవలం 1600 రూపాయలకు మాత్రమే విక్రయించి అన్నదాతలు దళారుల చేతిలో దగా పడుతున్నారన్నారు. గత మార్చి 20న జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాలను ఏర్పాటు చేసి మార్క్ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని కేంద్రం ఆదేశించిన నేటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతుందన్నారు. ఎకరానికి 25 క్వింటాళ్ల పరిమితి అనే నిబంధనలను తక్షణమే ఎత్తివేయాలని రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం తగిన గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో వ్యవసాయ భూముల సమస్యలు వేల సంఖ్యలో పెండింగ్లో ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో పైలెట్ ప్రాజెక్టు కింద నేలకొండపల్లి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతాంగం ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరిస్తామని గొప్పలు చెప్పిన మంత్రి పట్టించుకోకపోగా తిరిగి నేడు కూసుమంచి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద భూభారతి పేరుతో సమస్యలు పరిష్కరిస్తామని మాయమాటలు చెప్పడం రైతులను నిలువునా మోసం చేయడమే అన్నారు. ఒక్క నేలకొండపల్లి మండలంలోనే సాదా బైనామ కింద రైతులు చేసుకున్న 2000 దరఖాస్తులు పెండింగ్లో ఉండటమే మంత్రి నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం అన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుండి ధరణి స్థానంలో చేపట్టిన భూభారతి పేరుతో ఏ ఒక్క రైతుకు కూడా నూతన పట్టాదార్ పాస్ పుస్తకం అందించిన దాఖలాలు లేవన్నారు. 2003 లో దుమ్ముగూడెం ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా గోదావరి జలాలను జిల్లా మొత్తానికి అందించి సస్యశ్యామలం చేయాలని నాడు సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో తమ్మినేని వీరభద్రం బృందం చేపట్టిన మహా పాదయాత్రతో 2005లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. నాటినుండి నేటి వరకు సీతారామ ప్రాజెక్టుగా పేర్లు మారుస్తున్నారు తప్ప నిర్మాణం పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తాము అధికారం చేపడితే 2026 ఆగస్టు నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పిన మంత్రులు మొన్న బడ్జెట్లో 9000 కోట్ల రూపాయలకు గాను 336 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 21 ఏళ్లు గడుస్తున్న నిర్మాణం పూర్తి చేయకపోవడం పట్ల ప్రభుత్వం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు రైతాంగానికి సమాధానం చెప్పాలన్నారు. జిల్లా రైతాంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రానున్న కాలంలో ఉధృతమైన పోరాటాల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రైతు సంఘం 1936 ఏప్రిల్ 11న ఆవిర్భవించిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఈనెల 11న సంఘం ఆధ్వర్యంలో రైతులు జండా ఆవిష్కరణ చేయాలన్నారు. ఈనెల 18న తల్లాడలో జరిగే తెలంగాణ రైతు సంఘం జిల్లా మహాసభలు, 23, 24, 25 తేదీలలో కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర మహాసభలకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్ మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తులు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆధ్వర్యంలో ఇరాన్ పై జరుగుతున్న యుద్ధాలతో దేశంలోని రైతాంగం సామాన్య ప్రజానీకంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ కు వ్యతిరేకంగా అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. యుద్ధంపై భారత ప్రధాని నోరు మెదపకపోవడం వారి అసమర్థ విధానాలకు అద్దం పడుతుందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారి ప్రధాని మోడీ షా జోడి ప్రభావం తగ్గుతుందన్నారు. ప్రధాని మోడీ బండారం బయటపడే రోజు మరింత దగ్గరలోనే ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు భ్రమలు తొలగిపోతున్నాయన్నారు. ప్రతి రైతు వారి సమస్యల పట్ల అధ్యయనం చేయాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలని, తద్వారా సమస్యల పరిష్కారానికి మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని ఐక్యం చేసేందుకు గాను తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రానున్న కాలంలో యువ రైతుల మెగా సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బిక్కసాని గంగాధర్, గుడవర్తి నాగేశ్వరరావు, నేలకొండపల్లి మండల కార్యదర్శి రచ్చ నరసింహారావు, ఖమ్మం రూరల్ అధ్యక్ష కార్యదర్శులు తోట వెంకటరెడ్డి, ప్రతాపనని వెంకటేశ్వర్లు, తిరుమలాయపాలెం అధ్యక్ష కార్యదర్శులు తుళ్లూరు నాగేశ్వరరావు, బింగి రమేష్, జిల్లా నాయకులు మల్లెల సన్మంతరావు, ఊరడి సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేవీ రామిరెడ్డి, గిరిజన సంఘం నాయకులు భూక్య కృష్ణ, ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు, నాయకులు మారుతి కొండలరావు, దేగల వెంకటేశ్వరరావు, ఎడ్ల తిరుపతిరావు, ఏరదేశి నరసింహారావు, పొన్నం శివరాజు, మందడి కోదండ రామారావు, వాసంశెట్టి నరసయ్య, గురజాల వెంకటేశ్వర్లు, దండా రాధాకృష్ణ, నున్న మధుసూదన్ రావు, గుగులోతు వీరు నాయక్, మందడపు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గో ఆరాధన సకల దేవతల ఆరాధన

## - గ్రామసర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్




**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో మీడియా టుడే ఏప్రిల్ 03:**

గోవు ఆరాధిస్తే సకల దేవతల ను ఆరాధించిన పుణ్య వస్తుందని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గో సంరక్షక్ కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో గోమాతను జాతీయ ప్రాణీ గా గుర్తించలానే గో ఆరాధన ఉద్యమం కర పత్రికా ను ఆవిష్కరించారు. గో సంరక్ష ఉద్యమ కారులు కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న గో ఆరాధన దినోత్సవము ను పురస్కరించుకొని మండల తహసీల్దారు కార్యాలయం లో వినతులను అందించాలని కోరారు. అనంతరం సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ కు వినతి పత్రం ను అందజేశారు. ఈ కార్యక్రమశీ లో ఏఎంసి డైరెక్టర్ దేశగని నాగరాజు, అందే అరుణ్ కుమార్, దామెర నవీన్ , గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఈటల రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు



**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: కీసర ఏప్రిల్ 03**

భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా నియామకమైన శుభసందర్భంగా మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటెల రాజేందర్ గారిని మర్యాదపూర్వకంగా కలసి ధన్యవాదములు తెలిపిన కీసర మండల నాయకులు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారికి ఎంపీ శాలువాతో సత్కరించి అభినందించారు.

# శివాజీ మహారాజ్ విగ్రహ నిర్వహణ కరపత్రం ఆవిష్కరణ




**మిర్యాలగూడ ఏప్రిల్ 03 (మీడియా టుడే):**

చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్వహణకు సంబంధించిన కరపత్రాలు పట్టణం లోని వాసవి నగర్ లో ఎస్పిఆర్ స్కూల్ నందు హిందూ వాహిని ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సమావేశానికి ఆర్ఎస్ఎస్ జిల్లా క్యార్య విభాగ్ నాగరాజు, విభాగ్ భౌతిక్ ప్రముక్ జనార్ధన్ మాట్లాడుతూ శక్తి సమాజంలోనే హిందూ సమాజ చైతన్యం సాధ్యమవుతుందని, శివాజీ మహారాజ్ స్ఫూర్తితో నేటి యువత ఆదర్శంగా తీసుకొని విగ్రహ ధర్మరక్షణకు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విగ్రహ కమిటీ అధ్యక్షులుగా గంట సంతోష్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కార్యదర్శిగా కరుణాకర్ కోశాధికారిగా సత్యనారాయణ ను ఎన్నుకున్నారు. అనంతరం హిందూ వాహిని కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేపాల పురుషోత్తం రెడ్డి, ఉమాకర్ రెడ్డి, శ్రీనివాస్, సోమలింగం, సుధాకర్, రమేష్, బంటుగిరి, వెంకటేశ్వర్లు, నరేందర్, హిందూ వాహిని ప్రముఖులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ర్యాలీ

## - కేసు నమోదు చేసిన కీసర పోలీసులు

**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: కీసర ఏప్రిల్ 03**



హనుమాన్ జయంతి సందర్భంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాంపల్లి విలేజ్ చౌరస్తా నుండి నాగారం విజయ హాస్పిటల్ వరకు కార్‌లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించిన జీవన్ రెడ్డిపై గురువారం కీసర పోలీసులు కేసు నమోదు చేశారు. డీజే సౌండ్‌లతో రోడ్డు మొత్తం అడ్డగించి ర్యాలీ తీయడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడడంతో కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**కోదాడ, ఏప్రిల్ 03 (మీడియా టుడే)-:**
స్థానిక నయానగర్ బాప్టిస్ట్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోదాడ మున్సిపాలిటీ చైర్మన్ శ్రీమతి ఎర్నేని కుసుమ బాబు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తూ క్రైస్తవులకు అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చారు వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు 14 వ వార్డు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు 13వ వార్డు కౌన్సిలర్ మోడీ గురమ్మ సైదుబాబు పాల్గొని వచ్చిన భక్తులందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏసు ప్రభు సిలువలో పలికిన ఏడు మాటలు ఏడుగురు వక్తలు ధ్యానం చేశారు వారు మోజస్ స్రవంతి, శార, యాతాకుల జ్యోతి కవిత భాగ్యశ్రీ మెరీనారాణి ఏసుప్రభు వారి పలికిన మాటలు మాట్లాడి క్రీస్తు ప్రేమను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లి కొండ కోటయ్య బానోతు జగ్గు నాయక్, జాన్ హెడ్ కానిస్టేబుల్ సోమ పంగు నాగేశ్వరరావు శ్రవణ్ యాతాకుల మధుబాబు తదితరులు పాల్గొన్నారు

## మాదారం గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్346వ వర్ధంతి వేడుకలు



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 03**
ఊరుకొండ మండలంలోని మాధారం గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 346 వ వర్ధంతి సందర్భంగావారి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు శివాజీ విగ్రహ ప్రతిష్ఠ కమిటీ అధక్ష్యులు శ్రీను ఉపాధ్యక్షులు మహేష్ సభ్యులు దివాకర్ గౌడ్. శివ. రాజేందర్. లక్ష్మణ్. కిశోర్. భాస్కర్. నరేష్. శంకర్ తదితర యువకులు పాల్గొని చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది.

## పాలపాటి కిరణ్ పొలములో క్షేత్రస్థాయి ప్రదర్శన

**5 పాలపాటి కిరణ్ ను శాలువుతో సత్కరించి మెమొంటో**
**అందజేస్తున్న సర్పంచి, కంపెనీ సిబ్బంది**
**అధిక దిగుబడినిచ్చిన శ్రీకర్ ఆమని వరి రకం**
**రైతు పాలపాటి కిరణ్ కు మెమొంటో అందజేత**







**నవతెలంగాణ నేలకొండపల్లి 3**
ఎల్డోరాడో అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాదుకు చెందిన శ్రీకర్ ఆమని సన్న రకం వరి విత్తనం అధిక దిగుబడిని ఇచ్చినట్లు మండలంలోని సదాశివపురం గ్రామానికి చెందిన రైతు పాలపాటి కిరణ్ అన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్లో తాను సాగుచేసిన శ్రీకర్ ఆమని సన్న రకం వరి విత్తనంతో ఎకరానికి 45 క్వింటాళ్ల దిగుబడిని సాధించానన్నారు. ఈ రకం వరిలో తక్కువ పెట్టుబడితో పాటు అతి తక్కువ కాలం 125 రోజుల్లోనే కోతకు వచ్చినట్లు తెగుళ్ల ఉధృతి కూడా లేకపోవడంతో మంచి దిగుబడులు సాధించానన్నారు. వానాకాలం యాసంగి రెండు సీజన్లలో కూడా సాగుకు అనుకూలంగా ఉండడంతో పాటు మంచి దిగుబడులు వచ్చాయన్నారు. విషయం తెలుసుకున్న కంపెనీ సిబ్బంది శుక్రవారం సదాశివపురం చేరుకొని క్షేత్రస్థాయి ప్రదర్శన చేశారు. రైతు పాలపాటి కిరణ్ సాగుచేసిన తమ కంపెనీకి చెందిన వరి విత్తనాలు అధిక దిగుబడులు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ రైతు పాలపాటి కిరణ్ ను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ పాలపాటి సురేష్ ఆధ్వర్యంలో రైతు పాలపాటి కిరణ్ ను శాలువతో ఘనంగా సన్మానించి కంపెనీ తరఫున మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలపాటి సురేష్, ఆర్ఎంపి భరత్, ఖమ్మం ఏఎస్ఎంఎం సంపత్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిలువపైయేసుత్యాగంమానవత్వాన్ని మేల్కొలిపిన మహా సందేశం

**నేలకొండపల్లిలో భక్తి శ్రద్ధలతో ఘనంగా సాగిన గుడ్ ఫ్రైడే సిలువ యాత్ర.**



**నేలకొండపల్లి ఏప్రిల్ 3 మీడియా టుడే**
మంచి శుక్రవారం సందర్భంగా నేలకొండపల్లి పట్టణంలోని ప్రధాన పురవీధులలో భక్తి పరవశంతో మార్మోగింది . యేసుక్రీస్తు శిలువ వేయబడిన దుఃఖ ఘట్టాన్ని స్మరించుకుంటూ క్రైస్తవ విశ్వాసులు ఉపవాసాన్ని ఆచరిస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో సిలువ యాత్ర నిర్వహించారు. ఉదయం 9.30 నిమిషములకు పాత బస్ స్టాండ్ వద్ద గల రోమన్ క్యాతలిక్ చర్చి నుండి ప్రారంబమైన ఈ కార్యక్రమం, నేలకొండపల్లిలోని పుర వీధులలో తిరుగుతూ సాగిన సిలువ యాత్రతో మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొంది. యాత్రలో పాల్గొన్న క్రైస్తవుల చేతుల్లో సిలువలను మోసుకుంటూ, యేసుక్రీస్తు అనుభవించిన బాధలను స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. ప్రతి దశలో "ప్రభూ, మమ్ము క్షమించు" అంటూ వినిపించిన ప్రార్థనలతో వాతావరణం భావోద్వేగభరితంగా మారింది. ఈ సిలువ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తమ భక్తిని చాటుకున్నారు. సిలువ యాత్ర సాగిన మార్గమంతా స్థానికులు సిలువకు నీళ్లు ఆరబోస్తూ తమ భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. యేసు క్రీస్తు మానవాళి పాప విమోచన కోసం తన ప్రాణాలను సిలువపై అర్పించాడని ఫాదర్ స్మిలెన్ మారియో విశ్వాసులకు సందేశాన్ని అందించాడు. క్రీస్తు అనుభవించిన బాధలు, అవమానాలు అన్నీ ప్రేమతో సహించి చివరి శ్వాసవరకు క్షమాభావాన్ని చూపించాడని అలాంటి క్షమాబావాన్ని ప్రతి ఒక్కరు కలిగి జీవించాలని బోదించారు. ఒక పక్క తనను చంపివేస్తున్నారని తెలిసి కూడా వారిని క్షమించుము తండ్రి అనే ఆయన సిలువపై పలికిన మాటలు అపారమైన దయకు నిదర్శనమని బావోద్వేగబరిత ప్రసంగం చేశారు. సిలువపై చేసిన ఈ త్యాగం మానవత్వానికి ప్రేమ, క్షమ, సేవ అనే మహత్తర విలువలను నేర్పించిందని వెల్లడించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జోసెఫ్, బ్రదర్ మరియకుమార్, ఉపదేశకులు సూరేపల్లి జ్ఞానరత్నం, పుష్ప, థామస్, ప్రసాద్, పుల్లారావు, నాగేశ్వరావు, బాలరాజు, మాజీ వార్డు సభ్యులు పగిడికత్తుల రాంబాబు, ఎస్సి సెల్ జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మీ నారాయణ, మాల మహానాడు నాయకులు జంగం ప్రసాద్, యూనిటీ ఆఫ్ మాల జిల్లా కార్యదర్శి అవుట మధు, విచారణ సంఘ పెద్ద సిద్దెల వెంకటరత్నం, లక్ష్మి, ప్రసాద్, యువతి యువకులు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

**- వ్యాపారుల ఆవేదన - అధికారుల నిర్లక్ష్యంపై రేణుక అక్షరం మహిళా మండలి మండిపాటు**

**పనులు త్వరగా పూర్తి చేయాలని మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ డిమాండ్**



**మణుగూరు ,ఏప్రిల్03(మీడియా టుడే):**
మణుగూరు మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రేణుక అక్షరం మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణం ప్రారంభమై సంవత్సరాలు గడుస్తున్న... నేటికీ అసంపూర్తిగానే ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందుబాటులోకి రాకపోవడంతో పట్టణంలో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె అన్నారు. స్థానిక మహిళా మండలి కార్యాలయంలో మాట్లాడుతూ, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తూ తూ... మంత్రంగా పనులు అసంపూర్తిగా నిర్వహించి పక్కకు ఉంటున్నారు తప్ప... పూర్తి చేయడం లేదని ,దీని వల్ల ఆ నిర్మాణాల వల్ల ప్రజలకు దక్కాల్సిన ప్రయోజనం లభించడం లేదన్నారు. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కే పూర్తి చేయకుండానే మరో చోట సైడ్ డ్రైన్, సీ సీ రోడ్ల పనులు అప్పగించడం ఎటువంటి అభివృద్ధి మంత్ర మో అధికారులే తేల్చాలనీ డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్ల పైన ఎండలో ఎన్నో కష్టాలకోర్చి వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఇప్పటికైనా అందుబాటులోకి తేవాలని,మున్సిపాలిటీలో తలపెట్టిన ప్రభుత్వ అభివృద్ధి పనులు పూర్తికాకుండా ఆ పనులు నిర్వహించిన వారికి మరోచోట వర్కులు ఇవ్వకూడదని అన్నారు. మణుగూరులో ఇంటిగ్రేటెడ్ నిర్మాణం చేపట్టిన ఓ కాంట్రాక్టర్ ఆ పనులు అక్కడ నిలిపివేసి బినామీల ద్వారా మరో కాంటాక్ట్ పనులు నిర్వహించడం ఈ తతంగం అంతా మున్సిపాలిటీ అధికారులకు తెలిసిన చూసి చూడనట్టు వదిలేయడం సరైనది కాదని ,పనులు అసంపూర్తిగా ఉంచడంతో మార్కెట్ యార్డ్ క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంటుందని అన్నార . కాంట్రాక్టర్లు సిమెంట్ స్టాక్ పాయింట్ కి, కొబ్బరి చిప్పలు ఎండబోసుకునేందుకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోందని ,ఇప్పటికైన మున్సిపాలిటీ అధికారులు అసంపూర్తిగా నిలిచిపోయిన మార్కెట్ ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టిసారించి ఆ పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న క్రమంలో చర్యలు తీసుకొని పక్షంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# డబుల్ బెడ్రూం వాసులకు అండగా ఉంటా

**సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**




**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గం వర్గ ప్రతినిధి ఏప్రిల్ 03**
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూమ్ కాలనీలో పర్యటించి అక్కడ నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై టాస్క్-సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిస్పందించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించి ఆయన స్థానికులతో కలిసి కాలనీలో పర్యటించి,క్షేత్రస్థాయి పరిస్థితులను నేరుగా పరిశీలించారు, ఈ సందర్భంగా కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన గుర్తించారు,ఫ్లాట్ల వెనుక ఉన్న ప్రహరీ గోడ శిథిలావస్థకు చేరడంతో,పొదల నుండి పాములు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు, దీంతో ప్రాణ భయంతో జీవించాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు వారు వాపోయారు,అలాగే భవన నిర్మాణానికి సంబంధించిన మట్టి,దుమ్ము కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు తెలియజేశారు,ఈ అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం చూపిస్తామని సుంకిరెడ్డి హామీ ఇచ్చారు,మరోవైపు త్రాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఒక్కో వాటర్ క్యాన్‌కు రూ.30 చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని కాలనీవాసులు తెలిపారు,దీనిపై స్పందించిన సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి త్వరలోనే కాలనీలో రక్షిత మంచినీటి ఏర్పాటుకు తనవంతుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు,అదేవిధంగా కాలనీలో ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకునిఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, వైద్యులతో పరీక్షలు చేయిస్తామని భరోసా ఇచ్చారు,ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం జరిగే వరకు నిరంతరం కృషి చేస్తామని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోస్థానిక నాయకులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# భూదాన నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి

**-ఇళ్లు కోల్పయిన వారందరికీ అక్కడే ఇళ్లు ఇవ్వాలి**

**-ఓపిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జతిన్ కుమార్, విజయేందర్**




**మీడియా టుడే ఖమ్మంజిల్లా ప్రతినిధి :**
ఖమ్మం వెలుగుమట్లలో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ అక్కడ ఇళ్లస్థలాలిచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఓపిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జతిన్ కుమార్, విజయేందర్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రుల ఆదేశాలతో ఎనిమిదేళ్లుగా అక్కడే నివాసముంటున్న పేదల ఇళ్లను అమానుషంగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెలుగుమట్ల కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించకపోయినా వారు అనేక ఇబ్బందులు పడుతూ అక్కడే నివశిస్తున్నారని, వారి ఆవేదనను అర్థం చేసుకోకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేశారని విమర్శించారు. పైగా డబ్బులు వసూలు చేశారంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఫిబ్రవరిలో నిజనిర్ధారణ కమిటీ అక్కడ పర్యటించిందని, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపారని, పట్టాలున్న పేదల్లో భయభ్రాంతులు పోగొట్టాలని డిమాండ్ చేశారని వారు గుర్తు చేశారు. కమిటీ పర్యటించిన తర్వాత మంత్రుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇళ్లను కూల్చివేశారని విమర్శించారు. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు రావడంతో కొంతమందిని ఎంపిక చేసి, అక్కడనే ఇల్లు ఇస్తామని చెప్పి అర్హులకు అన్యాయం చేస్తోందన్నారు. అర్హులైన వారందరికీ అక్కడనే ఇళ్లస్థలం కేటాయించి ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఓపిడిఆర్ రాష్ట్ర బాధ్యులు డాక్టర్ మోహన్ పాల్గొన్నారు.

## శుక్రవారం రాత్రి నుంచి రెండు రోజులపాటు మీ సేవలు బంద్


**నేలకొండపల్లి ఏప్రిల్ 3 మీడియా టుడే**

శుక్రవారం రాత్రి నుంచి రెండు రోజులపాటు మీ సేవలు బంద్! తెలంగాణ కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో శుక్రవారం రాత్రి నుంచి అన్ని సేవలు నిలిచిపోనున్నాయి. షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ కోసం ఈ తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందని మీసేవ నిర్వాహకులు తెలిపారు.కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కావడానికి దాదాపు36 గంటల సమయం పట్టనుందని చెప్పారు .శనివారం, ఆదివారం సెలవులు కావడంతో, మీసేవలు సోమవారం ఉదయం నుంచి అందుబాటులోకి రానున్నాయి.ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని నిర్వాహకులు ప్రజలకు సూచించారు.

## ఖమ్మం రూరల్ మండలం గొల్లపాడులో దారుణం

### సంపేట సాయి ట్రాక్టర్ డ్రైవర్ గొంతు కోసి పరారైన దుండగులు

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**



ఖమ్మం : తల్లంపాడులో ఒక రియల్ ఎస్టేట్ వెంచర్లో పని చేస్తుండగా బలవంతంగా బండి వెక్కించుకుని కిడ్నాపుకు పాల్పడిన దుండగులు అరేకోడు తండా వద్ద సాయిపై హత్యాయత్నానికి పాల్పడి,గొంతు కోసి,చనిపోయాడని వదిలేసి వెళ్లిపోయారు. క్షతగాత్రుని పరిస్థితి విషమించ చడంతో ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం ఇచ్చారు.ఈ హత్యాయత్నంపై పలు రకాల అనుమానాలు వ్యక్తం కావడంతో పూర్తి స్థాయిలో ఖమ్మం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## తమ్మినేని వీరభద్రాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా తమ్మినేని వీరభద్రాన్ని పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం రూరల్ మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు , నేలకొండపల్లి మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వున్నం బ్రహ్మయ్య , టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల రథోత్సవం



**రాయికల్-మీడియా టుడే-ఏప్రిల్ 3:**

రాయికల్ మండలం తాట్లవాయి గ్రామంలో శుక్రవారం సీతారాముల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అటవీ ప్రాంతంలోని గుట్టపై ఉన్న చారిత్రక రామాలయంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. బ్రాహ్మణోత్తముల వేదమంత్రాల సాక్షిగా శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను భజనలతో ఆలయ నుండి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ తాట్లవాయి రామస్వామి గోవిందా గోవిందా అనుకుంటూ భక్తులు రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల మల్లేశం, ఉపసర్పంచ్ మారుపాక నారాయణ, పండితులు శ్యామ్ సుందర్ ఆచార్యులు, రంగా ఆచార్యులు, ధృవచార్యులు, మురళి ఆచార్యులు, మనోహర ఆచార్యులు, మదన్మోహన్ ఆచార్యులు, మాజీ సర్పంచ్ కొసరి మహేష్, పాలకవర్గం రాజోళ్ళ లాహిరి మహిపాల్, చుక్క పెద్దులు యమశ్రీ వేంకటి సురేష్, గంగాధర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 10న 'జైఎన్టీఆర్' జయహో బాలయ్య

### తెలుగు ప్రజల గుండెచప్పుడు - కార్యక్రమం బ్రోచర్ ఆవిష్కరణ




**ఖమ్మం :** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జై ఎన్టీఆర్ జయహో బాలయ్య, తెలుగు ప్రజల గుండెచప్పుడు, బ్రోచర్ ఆవిష్కరించిన ఖమ్మం టిడిపి ఆఫీసులో ఘనంగా జరిగింది. మాజీ జిల్లా కార్యదర్శి, అడహక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్ చంద్ర బ్రోచర్ను ఆవిష్కరించారు. మొగిలి ఎంటర్టైన్మెంట్స్ సమర్పణలో ఈ నెల 10న ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా జై ఎన్టీయార్ – జయహో బాలయ్య శీర్షికన తెలుగు జాతి గుండె చప్పుడు వినిపించబోతోంది. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు , నటరత్న నందమూరి బాలకృష్ణ నటించిన చిత్రాలలోని పాటలు,డాన్సులతో అలరించనున్నారు. నందమూరి అభిమానులచేత కితాబులందుకున్న సీనియర్ ఎన్టీఆర్ డూప్ , బాలకృష్ణ డూప్ విన్యాసాలు, పంచ్ డైలాగులు ఖమ్మం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర తెలిపారు. అదే విధంగా గాయకులు వీవీరెడ్డి,లక్ష్మీనారాయణ, గణపతిరాజు,రామారావు కావేరి,దాస్, నాగభూషణం, మోజీ లక్ష్మణ్ , భిక్షం, స్వప్న,కీర్తి,స్నేహ,చైతన్య లచే సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మొగిలి వెంకటేశ్వర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ ప్రధాన కార్యదర్శి బండి వీరయ్య, ఆర్గనైజర్ నాగసాయి, టిడిపి నాయకులు చింతనిప్పు నాగేశ్వరరావు, బోడేపూడి రవి, అంగిరేకుల వెంకన్న, వాడేపల్లి బిక్షపతి, చిట్టూరి సూర్యం, మంకెన శ్రీను, కిలారు హరీష్, నర్వనేని శంకర్ తదితరులు పాల్గొన్నారు. నందమూరి అభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కేతినేని హరీష్ చంద్ర కోరారు.

# MGNREGA పేరు మార్పు యత్నం సహించం

### ఉపాధి హామీ కూలీల హక్కుల కోసం పోరాటం ఉధృతం చేస్తాం: టి. రాజశేఖర్ రెడ్డి






**మహబూబాబాద్ జిల్లా, బ్యూరో ఏప్రిల్, 03 ,మీడియా టుడే. కెసముద్రం, ఏప్రిల్ 3:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) పేరును మార్చే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఖఖజ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధి హామీ కూలీల హక్కులను పరిరక్షించేందుకు చేపట్టిన »»MGNREGA బచావో – VB_G_RAM_G హటావో" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కె.సముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల నుంచి భారీ స్థాయిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం రాహుల్ గాంధీ పిలుపు మేరకు, అసంఘటిత కార్మికుల నేషనల్ చైర్మన్ ఉదిత్ రాజ్, తెలంగాణ చైర్మన్ కౌశల్ సమీర్ సూచనలతో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా టి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూలీలు, కార్మికులు, గ్రామీణ పేదల హక్కులను క్రమంగా బలహీనపరిచే విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. గ్రామీణ పేదలకు ఉపాధి, భరోసా, ఆర్థిక రక్షణ కల్పించే MGNREGA చట్టాన్ని బలహీనపరిచి, కూలీల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలకు కేంద్రం పాల్పడుతోందని విమర్శించారు. మహాత్మా గాంధీ పేరుతో నడుస్తున్న ఈ పథకానికి పేరు మార్పు చేయడం అనేది కేవలం పరిపాలనా మార్పు కాదని, అది దేశ చరిత్రను, స్వాతంత్ర్య పోరాట విలువలను అవమానపరచడమేనని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ కార్మికుల సంక్షేమానికి వెన్నెముకలా నిలిచిన ఈ పథకాన్ని కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు."పేదల పొట్టకొట్టి పెద్దల లాభాల కోసం చట్టాలను మార్చే విధానాన్ని ప్రజలు ఎప్పటికీ అంగీకరించరు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రతి కుట్రను ప్రజలతో కలిసి తిప్పికొడతాం. కార్మికుల, రైతు కూలీల, అసంఘటిత వర్గాల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్తాం" అని ఆయన హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, పేదల వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే గ్రామీణ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఖఖజ మైనార్టీ రాష్ట్ర నాయకులు మున్నా జానీ, జిలానీ, కె.సముద్రం మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయూబ్ ఖాన్, కె.సముద్రం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్ ఖాన్, కాల్వల సర్పంచ్ సుజాత రామచందర్, నర్సింహులగూడెం సర్పంచ్ భూక్య కవిత, మద్రి తండా సర్పంచ్ వి. తేజు, క్యాంప్ తండా ధరవత్ కైక, నారాయణపురం ధరవత్ యమునతో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శేరిలింగంపల్లి మీడియా టుడే న్యూస్ ఏప్రిల్ 3:**

శిల్పారామం మాదాపూర్ లో సాంస్కృతిక కార్యక్రమాలలో భగ్నగా ఒడిస్సి మరియు కథక్ నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. ధారోహర్ డాన్స్ అకాడమీ నీలాంజన చౌదరి ఆధ్వర్యం లో ఒడిస్సి నృత్య ప్రదర్శనలో శాంతాకారం, నమామి, దళి, స్థాయీ, జనసమోహిని పల్లవి, ప్రదర్శనలు తనుశ్రీ , రియా నూతన, పావని, దేబశ్రీ, మొదలైన వారు ఓరదర్శించి మెప్పించారు. కథక్ నృత్య ప్రదర్శనలో గురువందనా, అభినయ, తరణ అంశాలను కళాకారులూ నీతి, నవ్య, సన, డెబ్రాని, రుద్రాణి, ఖుష్బూ, ఇందిరా, పూజిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. గురు శ్రీ సంజయ్ కుమార్ జోషి, ప్రీతీ మహాపాత్ర, శ్రావ్య మానస లు ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



# ఆరెంద హై స్కూల్‌లో సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

### గురువులకు సన్మానం సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్న విద్యార్థులు





**ఏప్రిల్-03 మంథని**

మంథని మండలం ఆరెంద హై స్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. 2023-24 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు చాలా కాలం తరువాత ఒకే వేదికపై కలుసుకుని పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులు, స్నేహితులతో గడిపిన అనుభవాలను పంచుకుంటూ కార్యక్రమాన్ని ఆత్మీయంగా జరిపారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు సన్మానం నిర్వహించారు. గురువుల పట్ల కృతజ్ఞతను తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాటలు, డాన్స్‌లతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. అప్పటి ప్రధానోపాధ్యాయుడు కానుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని కష్టపడి చదివితే మంచి భవిష్యత్ సాధించవచ్చని తెలిపారు. సమాజంలో గుర్తింపు పొందే స్థాయికి ఎదగాలని, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గురువుల మార్గదర్శకతను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, హన్మంతరావు, చారి, విజయ్, మల్లన్న సిఆర్‌పి తో పాటు పూర్వ విద్యార్థులు శివాజీ, రాంచరణ్, అంజి, మనీష్, అభి, సిరి, ఐశ్వర్య, వైష్ణవి, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సలహాదారును నరేందర్ రెడ్డిని కలిసిన ప్రణవ్

### డంప్ యార్డ్ ప్రతిపాదన హుజూరాబాద్ నుండి వెనక్కి తీసుకోండి

**- వారంలో రెండోసారి ఈ విషయంపై చర్చ**



**హుజూరాబాద్/ఏప్రిల్ 03:**
హుజూరాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో నిర్మించ తలపెట్టిన డంప్ యార్డ్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ ని కలిసి దాని వల్ల వచ్చే అనర్ధాలను,ఇతర ప్రాంతాలకు తరలిస్తే ప్రజలకు ఎంత ఉపయోగమో వివరించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ ప్రాంతం వ్యవసాయానికి మూలాధారమని ప్రజల మనోభావాలు అర్ధం చేసుకొని,ఈ వేస్ట్ టు ఎనర్జీ యార్డుతో జనాలతో పాటు,వాటి వ్యర్థాల వల్ల పంట పొలాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు.జనావాసాల మధ్య కాకుండా వేరేచోటుకి దీన్ని మార్చాలని కోరారు.ఈ విషయమై ఇప్పటికే వారంలో రెండవ సారి కలిశామని దీనిపై ఎలాంటి ముందుకు వెళ్లొద్దని,సీఎం దృష్టికి ఈ విషయం తెలపాలని కోరారు.సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈ విషయమై చర్చిస్తామని భరోసా కల్పించారు.

## సొంతింటి కల నెరవేరిన వేళ






**ఉమ్మడి మెదక్ ఏప్రిల్ 03:**
ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు.. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి లిదుబ్బాక నియోజకవర్గం నార్సింగి మండలం కేంద్రంలో అంబటి వెంకటలక్ష్మి శ్రీనివాస్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవం చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తదనంతరం నార్సింగ్ మండలానికి చెందిన దాయం రామవ్వ 40,000/-రూపాయలు బుద్ధి కొండయ్య 60,000/-రూపాయల విలువగల CMRF చెక్కులను లబ్ధిదారులకు శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కారేపల్లిలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**సింగరేణి ఏప్రిల్ 03:**




కారేపల్లిలో సీఎసఐ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న రోమన్ క్యాథలిక్ చర్చి నుండి ఫాదర్ రెవరెండ్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు విశ్వానులు శిలువమార్గం చేస్తూ పాదయాత్రగా కారేపల్లిలోని ప్రధాన వీధులలో ప్రదర్శన చేశారు. ప్రధాన కూడళ్లలో ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలకు సంబంధించి దైవ సందేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్మలా స్కూల్ సిస్టర్స్, జ్యోతి సిస్టర్, పినీల సిస్టర్, ఉపదేషులు ప్రసాద్, వీరభద్రం, బాలస్వామి, సునీత, సుజాత, అనిత, సంగస్టులు రత్తయ్య, బస్వకుమార్, నాగభూషణం, బయ్య నాగేశ్వరరావు , చిలుముల ప్రశాంత్, శ్రీను, కుమార్, జయమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



**సింగరేణి ఏప్రిల్ 03:**
కారేపల్లి మండలం విశ్వనాధపల్లి గ్రామపంచాయతీ రామలింగాలపల్లి(కారేపల్లి క్రాస్ రోడ్డు)లో సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో కాలనీ వాసుల కోరిక మేరకు నూతన పాలక వర్గం సీసీ రోడ్డును మంజూరు చేసింది. ఈసందర్బంగా సర్పంచ్ ఇస్లావత్ రాజు మాట్లాడుతూ విశ్వనాధపల్లి గ్రామపంచాయతీలో అన్ని వీధులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్నాయక్ సహకారంతో సీసీ రోడ్లుగా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఉపసర్పంచ్ ధనమ్మ, వారు ?డసభ్యులు సిద్దంశెట్టి హారిక, బట్టు రోజా, ముఖర్జీ, సుజాత, గ్రామపెద్దలు సిద్ధంశెట్టి నాగయ్య, తోటకూరి రాంబాబు, పురం గోవర్ధన్, సూరపురెడ్డి కమలాకర్‌రెడ్డి, బట్టు మోహన్, బట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ సాధించకపోతే రాజీనామాకు సిద్ధం"

### - ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్



తెలంగాణలో ముదిరాజ్ సమాజం ఎదుర్కొంటున్న రిజర్వేషన్ సమస్యలు పరిష్కరించకపోతే, మంత్రి వాకిటితో పాటు తాను కూడా రాజీనామా చేయడానికి సిద్ధమని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్పష్టం చేశారు.శుక్రవారం హైదరాబాద్‌లోని బోయిగూడ ముదిరాజ్ సంఘంలో రాష్ట్ర ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సమన్వయ కమిటీ ఏర్పాటు, బీసీ డి నుంచి బీసీ - ఏ లోకి మార్పు వ్యూహాలు, కోకాపేట ముదిరాజ్ భవన నిర్మాణం, జర్నలిస్టుల సమస్యలు ఈ నాలుగు కీలక అంశాలపై ఆయన జర్నలిస్టులతో విస్తృత చర్చ నిర్వహించారు.

**ఐక్యతతో ఉద్యమిద్దాం**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జాతి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పని చేసిన వారు ఉన్నా, ఇప్పటి వరకు కులాన్ని తప్పుదోవ పట్టించడానికి 40కి పైగా సంఘాలు ఏర్పాటయ్యాయని ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ విచారం వ్యక్తం చేశారు. ఐక్యమత్యం ఉంటే మాత్రమే అలాంటి విభజనలకు చెక్ పెట్టి సమన్వయం సాధించవచ్చున్నారు.ఈ దిశగా ఈటెల, కాసాని, బండ ప్రకాష్, మంత్రి వాకిటి వంటి నలుగురు నాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా సర్పంచుల సన్మాన సమావేశం నిర్వహించామని ఆయన తెలిపారు. ఇకపై మీడియా, న్యాయ, మహిళ, విద్య, యువత విభాగాలతో కలిసి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నదే తమ నిర్ణయమని జ్ఞానేశ్వర్ అన్నారు."ప్రస్తుత సంఘాలు అలాగే ఉంటాయి. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాం. గతంలో కుల సంఘాల పెద్దలు చేసిన తప్పులు మళ్లీ చేయకూడదు" అని స్పష్టం చేశారు.

**కోకాపేట భవనం - ఇతర సమస్యలు**

కోకాపేటలో భవనం నిర్మాణానికి స్థలం ఉంది, కానీ నిధులు లేవు. అందరూ సహకరిస్తే సాధించి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలో మంత్రి వాకిటితో జర్నలిస్టుల సమావేశం ఏర్పాటు చేస్తానని, కార్పొరేషన్ సహకారంతో నిధులు వచ్చిన వెంటనే కులానికి కేటాయిస్తానని ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ తెలిపారు. ఎన్ని అటంకాలు ఎదురైనా త్వరలో జిల్లాల పర్యటన చేస్తానన్నారు.

**ఇతర నాయకులు - జర్నలిస్టుల స్పందన**

సంఘం గౌరవ సలహాదారుడు బలరాం ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు చింతల నిలకంఠం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు అనిల్ ముదిరాజ్, యాటకర్ల మల్లేష్ ముదిరాజ్, అబ్బులు ముదిరాజ్, బిక్షపతి ముదిరాజ్, అంబర్ పేట సతీష్ ముదిరాజ్, వ్యాస్ ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ సమన్వయ కమిటీ ఏర్పాటు, బీసీ - డీ నుంచి బీసీ ఏ లోకి మార్పు, కోకాపేట భవన నిర్మాణం, జర్నలిస్టుల సంక్షేమం, సోషల్ మీడియా వినియోగం వంటి అంశాలపై తమ సూచనలు అందించారు.గ్రామ స్థాయిలో రిజర్వేషన్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, కుల జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని, సమన్వయ కమిటీలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాండు ముదిరాజ్, శివ ముదిరాజ్, సుగ్రీవ్ ముదిరాజ్, వేంకటేష్ ముదిరాజ్, వాసు ముదిరాజ్, జితేందర్ ముదిరాజ్, సత్యం ముదిరాజ్, స్వామి ముదిరాజ్, గోనేల కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు..

# హుజురాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

### బంద్‌కు అన్ని వర్గాల సంపూర్ణ మద్దతు

### "డంపింగ్ యార్డ్ ఏర్పాటు వెంటనే ఉపసంహరించుకోవాలి



**హుజురాబాద్/ఏప్రిల్ 03:**
కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ఏర్పాటు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పాడి కౌశిక్ రెడ్డి మరియు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. హుజురాబాద్ పట్టణంలోని వ్యాపార, వాణిజ్య రంగాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. దేశానికి నాణ్యమైన విత్తనాలను అందించే ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములు నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ అంశంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేదంటే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నెల 7, 8 తేదీల్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో రెండు రోజుల పాటు పాల్గొంటానని తెలిపారు. బంద్‌కు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ గూటికి తాళ్లపల్లి సర్పంచ్ నీల ప్రభాకర్

**ఉమ్మడి మెదక్ఏప్రిల్ 03:**
తెలంగాణ రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలకు ఆకర్షితులై, దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలపాటుకు తోడ్పడుతూ తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ నీల ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పి ఆత్మీయంగా స్వాగతం పలికారు..ఈ సందర్భంగా తాల్లపల్లి గ్రామ సర్పంచ్ నీల ప్రభాకర్ మాట్లాడుతూ దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతోందని, నీల ప్రభాకర్ చేరికతో పార్టీ మరింత శక్తివంతమై విజయదిశగా దూసుకెళ్తుందని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, దుబ్బాక మరియు మిరుదొడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్లు కొంగరి రవి, బొమ్మర సంయుక్త శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఏలూరు కమలాకర్, బేగంపేట గ్రామ సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, తాళ్లపల్లి ఉప సర్పంచ్ పాతూరి నవీన్ గౌడ్, నగరం ఉప సర్పంచ్ జీడిపల్లి రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సోలిపేట ప్రసాద్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ముత్తంగి భూమయ్య, జంగపల్లి ఉపసర్పంచ్



రామగుల్ల స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు..

# మానవసేవే మాధవసేవ సర్పంచ్

### - అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్

**సింగరేణి ఏప్రిల్ 03:**
సింగరేణి మండలం,అప్పాయిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మృదు స్వభావి,విద్యావేత్త,మనసున్న మహారాజు,దండు ప్రవీణ్ గారు గ్రామ అభివృద్ధి కాకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను మంచి మనసుతో మానవత్వ దృక్పథంతో అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కుటుంబంలో ఆడబిడ్డ పుడితే వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని,సుకృతి నిధి పథకం కింద పోస్ట్ ఆఫీసులో అకౌంట్ తీపించి,సుకన్య సమృద్ధి యోజన పథకంలో 5016/- రూపాయలు ఆర్థిక సహాయం అందించి,ఖాతాలో జమ చేయడం జరుగుతుంది.అదేవిధంగా సంత్వన నిధి పథకం కింద కుటుంబంలో ఏ వ్యక్తి అయినా మరణించినచో వారి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం







5000/- రూపాయలు ఆర్థిక సహాయాన్ని వెంటనే ఆ కుటుంబానికి అందించడం జరిగింది.ఈ రెండు పథకాలు సర్పంచ్ ప్రమాణస్వీకారం చేసిన దగ్గర నుండి అమలు చేయడం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో పథకాలు చేస్తానని సర్పంచ్ దండు ప్రవీణ్ గారు తెలిపారు.ఈ సేవ కార్యక్రమాలను అందుకున్న ప్రజలు భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అధిష్టించాలని,గొప్ప స్థాయిలోకి వెళ్లాలని గ్రామపంచాయతీ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.


## నిర్మలమ్మకు కనిపించని ప్రజా జీవిత వాస్తవాలు

ఈ నెల 1న లోక్‌సభలో 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఆ వార్షిక పద్దుపై ప్రభుత్వ ప్రతినిధులు, సంపాదకీయ రచయితలు, ఆర్థిక వ్యవహారాలపై వ్యాఖ్యాతలు, పాత్రికేయులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ 'జాగరూకత' అనే పదాన్ని, 'ఉన్న స్థితిని చెదరగొట్టి తలకిందులు చేయవద్దు' (డోంట్ రాక్ ది బోట్) అనే పదబంధాన్ని ఉపయోగించారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఆర్థిక సర్వే 2025--26 గుర్తించింది; అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల సమరం భారత్ సరుకులపై విధించిన 50శాతం సుంకాలను 18శాతానికి తగ్గించనున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ 'తగ్గింపు'నకు షరతులు ఉన్నట్టుగా కనిపిస్తోంది. భారత్‌కు అమెరికన్ ఎగుమతులపై నయాపైసా సుంకం విధించకపోవడం, సుంకాలేతర అవరోధాలను పూర్తిగా తొలగించడం, 50,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడం మొదలైనవి. ఇంకా ఇతర షరతులు ఉండవచ్చు. అయితే ఈ షరతులను పాటించడం భారత్‌కు సాధ్యం కాకపోవచ్చు. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావలసిన స్థాయిలో రావడం లేదు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపుదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. నగదు సమృద్ధిగా ఉన్న భారతీయ వ్యాపారవేత్తలు మదుపు చేసేందుకు సంకోచిస్తున్నారు. పర్యవసానంగా 'స్థూల స్థిర మూలధన సంచయం' భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30శాతంగా మాత్రమే ఉండిపోయింది. నామమాత్ర జీడీపీ వృద్ధిరేటు అసంతృప్తికరంగా ఉన్నది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ) అనుసరించిన గణన పద్ధతులు, జాతీయ ఖాతాలపై అంతర్జాతీయ సంస్థల సందేహాలతో యథార్థ జీడీపీ వృద్ధిరేట్లపై అనుమానపు నీడలు కమ్ముకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ నిజ స్థితిగతులను అంచనా వేసేందుకు నామమాత్ర జీడీపీ ఒక మంచి సూచకం. ఇది 2023--24, 2024--25, 2025--26 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా 12శాతం, 9.8శాతం, 8శాతం మేరకు పెరిగింది. ఏమైనా వృద్ధి వేగాన్ని కోల్పోతోంది సుమా! నిరుద్యోగిత పెరిగిపోయింది. జూన్ 2025లో యువజనుల నిరుద్యోగిత రేటు 15శాతంగా ఉన్నది. దేశ శ్రామిక జనవాళిలో 21.7శాతం మంది మాత్రమే క్రమబద్ధమైన వేతన ఉద్యోగాలలో ఉన్నారు. లక్షలాది యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ నిరుద్యోగులు స్వయం ఉపాధి వైపునకు మళ్లుతున్నట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తయారీ రంగంలో అగ్రగామి కాకుండా ఏ దేశమూ మధ్య ఆదాయ దేశంగా రూపొందదు. భారతదేశ జీడీపీలో తయారీరంగం వాటా గత పది సంవత్సరాలుగా 15 లేదా 16 శాతంగా మాత్రమే ఉంటోంది. పీఎల్ఐ, ఇతర పథకాలు ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యాయి; ద్రవ్య సమీకరణ బాధాకరంగా మందగించింది. ద్రవ్యలోటు 2025--26లో 4.4 శాతం నుంచి 2026--27లో 4.3శాతానికి తగ్గనున్నది. రెవెన్యూ లోటు 1.5శాతంగా ఉండిపోనున్నది. ఎఫ్ఆర్‌బీఎమ్ లక్ష్యాలను చేరుకునేందుకు 12 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పట్టవచ్చు. అందుకు మనం భారీ మూల్యమే చెల్లించనున్నాము. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు, ఆర్థిక సర్వే మొదటి అధ్యాయంలోనే 'జాగ్రత్తగా ఉండాలి. అయితే నిరాశావాదం అవసరం లేదు' అని సూచించారు. ఈ ఆశావహ దృక్పథమే ఆ నివేదిక అంతటా కనిపించింది. మరో అధ్యాయంలో ప్రభుత్వం విశ్వసనీయమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వ రుణాలను తగ్గించుకోవాలని, జీడీపీ--రుణాల నిష్పత్తిని కూడా బాగా తగ్గించుకోవాలని సూచించారు. పట్టణీకరణ విషయంలో మెట్రోపాలిటన్ పాలనా వ్యవస్థలను పటిష్ఠపరచాలని, సమృద్ధిగా నిధుల కేటాయింపులతో నగరాలకు ఆర్థిక సాధికారత కల్పించాలని పేర్కొన్నారు. పట్టణీకరణ విషయంలో ఆయన దృక్పథం సాహసోపేతంగా ఉందని చెప్పవచ్చు. 2025--26 ఆర్థిక సంవత్సరపు పన్నుల జూదం విఫలమయింది. గత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి డివిడెండ్ రూపంలో ఉదారంగా అందిన దాదాపు రూ.3,04,000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో అంకెలు ఘనంగా కనిపించేందుకు దోహదం చేశాయి. అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాలలో ఆర్బీఐ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్‌గా వరుసగా రూ.2,10,874 కోట్లు, రూ.2,68,590 కోట్లు సమకూరాయి. యూపీఏ ప్రభుత్వాల హయాం (2004--14)లో రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో సమకూరిన గరిష్ఠ మొత్తం (2013-14లో) రూ.52,679 కోట్లు. తన ప్రధాన సలహాదారు రూపొందించిన ఆర్థిక సర్వేకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిస్పందన అస్పష్టంగా ఉన్నది. తన 85 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించిగానీ, సుంకాలు, నిర్బంధ వాణిజ్య ఒప్పందాల రూపేణా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేస్తోన్న ద్విముఖ దాడి గురించి ఆమె ఎటువంటి వ్యాఖ్య చేయలేదు! అంతకంతకూ మహా శక్తిమంతమవుతోన్న చైనా ఆర్థిక వ్యవస్థ గురించిగానీ, ఆర్థిక వ్యవహారాలపై మెరుగైన అవగాహన ఉన్నవారు బడ్జెట్ నుంచి ఆశిస్తున్న విషయాలపైగానీ ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఆర్థిక మంత్రిగానీ, ప్రభుత్వంగానీ ఆర్థిక సర్వేను లెక్కలోకే తీసుకోలేదు-- ఇది నేను ఉదారంగా చేస్తున్న విమర్శ. 'మనం సౌర వ్యవస్థలోని ఒక గ్రహవాసులమని ప్రస్తుత పాలకులు భావించడం లేదు' అనేది నేను నిర్దయగా చేసే విమర్శ. మందగించిన వృద్ధిరేటు, పేదరికం, పెరుగుతున్న అసమానతలు, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, సంక్షేమంపై నిర్లక్ష్యం, రూపాయి విలువ తగ్గుదల మౌలిక సదుపాయాలు, అత్యవసర సేవల విషయంలో గిరాకీ, సరఫరాల మధ్య అంతరాలతో దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుసరించనున్న విధానాలు ఏమిటో ఆర్థికమంత్రి తన ప్రసంగంలో వెల్లడించకపోవడం నన్ను నిర్ఘాంతపరిచింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని ఆర్థికరంగ నిపుణులు తీవ్రంగా విమర్శించారు. భారత్-- ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటూ ప్రభుత్వం తనను తాను అభినందించుకోవడాన్ని డాక్టర్ సూర్జిత్ భల్లా ఎగతాళి చేశారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని డాక్టర్ అశోక్ గులాటి గర్హించారు. ఆర్థికమంత్రి తన ప్రసంగంలో అనేక పథకాలు, కార్యక్రమాలు, మిషన్‌లు, సంస్థలు, చొరవలు, ఫండ్స్, కమిటీలను ప్రస్తావించారు.

# మత జాతీయవాదం భారత్‌కు మేలు చేసేనా?

'పాకిస్థాన్ తన ముస్లిమేతర పౌరులను ఎంతగా దురవస్థలకు గురిచేసినా మనం మన మైనారిటీ మతస్థులపట్ల నాగరీక రీతిలో వ్యవహరించాలి. మన అల్పసంఖ్యాక వర్గాలకు పూర్తి భద్రత కల్పించి, ఒక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరులకు ఉండే హక్కులు అన్నిటినీ మన ముస్లిం మైనారిటీలకు ఇవ్వాలి'-- 1947 అక్టోబర్ 15న ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఉద్ఘాటించిన మాటలవి. లౌకికవాదం, మైనారిటీలకు సమానహక్కుల విషయంలో నెహ్రూ నిబద్ధతకు కాంగ్రెస్ పార్టీలోనే సంపూర్ణ ఆమోదం లేదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలోనూ, ఆ తరువాత తన జీవిత పర్యంతం కాంగ్రెస్‌లోనూ, విశాల భారతీయ సమాజంలోనూ మితవాద హిందూ శక్తుల ప్రభావాన్ని సమర్థంగా ప్రతిఘటించేందుకు ప్రధాని నెహ్రూ నిరంతరం కృషి చేశారు. ఆయన మరణానంతర దశాబ్దాలలో మాత్రమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనసంఘ్, ఈ పార్టీ ప్రస్తుత అవతారమైన భారతీయ జనతా పార్టీ తమ ప్రభావ ప్రాబల్యాలను పెంచుకున్నాయి. దేశ విభజన అనంతరం భారత్ లౌకికవాద రాజ్యాంగాన్ని రూపొందించుకుని బహుళత్వ, సమ్మిళిత భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా ఔదలదాల్చింది. దేశ పాలనా వ్యవహారాలు మత ప్రమేయం లేకుండా జరిగేందుకు తొలి ప్రధాని నెహ్రూ సుస్థిర పునాదులు వేశారు. అయితే మతాన్ని రాజ్య వ్యవహారాలతో మిళితం చేసిన మార్గాన్ని అనుసరించిన పాకిస్థాన్‌కు భారత్ ఇప్పుడు ఆ విషయంలో చేరువవుతోంది! మెజారిటీవాద ధోరణి ప్రస్తుత పాలకపక్షం వ్యవహారాలలో స్పష్టంగా కనిపిస్తోంది. గత మూడు సార్వత్రక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన 800 మందికి పైగా ప్రజా ప్రతినిధులలో ముస్లిం మతస్థులు ఒక్కరూ లేరు! నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ హిందూ ఓటు బ్యాంకును సృష్టించుకోవడంలో చాలావరకు సఫలమయింది. హిందూ ఓటర్ల మద్దతు ఆధారంగా తరచూ ఎన్నికలలో విజయాలు సాధిస్తోంది. హిందువులకే ప్రథమ ప్రాధాన్యమిచ్చే రాజకీయాల అజెండా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పదే పదే అధికారాన్ని కైవసం చేసుకునేందుకు తోడ్పడుతుండడంతో సంఘ్ పరివార్ భారతీయ సమాజంలో తన ప్రభావ ప్రాబల్యాలనూ ఇతోధికంగా పెంపొందించుకుంటోంది. ఈ క్రమంలో భారతీయ ముస్లింలను (అప్పుడప్పుడూ భారతీయ క్రైస్తవులను కూడా) పలు విధాలా వేధింపులకు గురిచేస్తోంది. ఆ మైనారిటీ మతస్థుల పట్ల విద్వేషాన్ని ప్రోత్సహిస్తోంది. ముస్లింలు ఒకప్పుడు కేంద్ర కేబినెట్‌లో ప్రధాన మంత్రిత్వ శాఖలకు సారథ్యం వహించారు. దౌత్య శ్రేణులకు, గూఢచార వర్గాలకు నాయకత్వం వహించారు. భారత ప్రధాన న్యాయమూర్తులుగా దేశ న్యాయపాలనను నిర్దేశించారు. భారత వాయుసేనకు అధినేతలుగా ఉన్నారు. ఇటీవలి కాలంలో అంటే 2014కు పూర్వం నరేంద్ర మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో రెండు నగరాలు పార్లమెంటులో తమ ప్రతినిధులుగా ముస్లింలను ఎన్నుకున్నాయి. మరి ఇప్పుడో? మన ప్రజా జీవితంలో ప్రముఖ స్థానాలలో ఉన్నవారిలో ఒక్క ముస్లిం కూడా లేడు. కాయ కష్టంతో బతికే ముస్లింలను నిత్యం అనేక విధాలుగా అవమానిస్తున్నారు. ముస్లింల భారతీయ పౌరసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు వారి దేశభక్తిని శంకిస్తున్నారు. వారిని లక్ష్యంగా చేసుకుని హింసాకాండకు పాల్పడుతున్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మూకదాడులు చేస్తున్నారు. న్యాయవిరుద్ధంగా ముస్లింల గృహాలను కూల్చివేస్తున్నారు. లౌకికవాద, బహుళత్వ, సమ్మిళిత ప్రజాస్వామ్యమే భారత్ భావన హృదయం. అయితే పాకిస్థాన్‌కు పునాది అయిన మత జాతీయవాదం ప్రాతిపదికను ప్రాథమికంగా ప్రతిబింబించే ఆధిపత్యవాద రాజ్యంగా భారత్‌ను రూపొందించేందుకు బీజేపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి. జాతి జీవనంలోని వివిధ రంగాలలో ఇది ప్రతీకాత్మకంగాను, ఆచరణాత్మకంగాను కనిపిస్తోంది. పాలకపక్షం మాటలు, చేతలు ఆ లక్ష్య పరిపూర్తిని మరింత త్వరితం చేసేవిగా ఉన్నాయి. హిందూ మెజారిటీవాదం మే 2014 నుంచే ప్రారంభం కాలేదు. దానికి సుదీర్ఘ చరిత్ర ఉన్నది. 19వ శతాబ్దిలో హిందూ మిషనరీ సొసైటీల కార్యకలాపాలు, 20వ శతాబ్దిలో హిందూ మహాసభ రాజకీయాలు, 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భావం ఆ చరిత్రలో భాగాలే. రాజ్య వ్యవహారాలలో మత ప్రమేయం లేకుండా ఉండేందుకు నెహ్రూ నిరంతరం అప్రమత్తంగా ఉండేవారు. అయితే ఆయన మనవడు రాజీవ్‌గాంధీ షా బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఉత్పన్నమైన సంక్లిష్ట రాజకీయ పరిస్థితులలో అనుసరించిన విధానాలు హిందూత్వ శక్తుల ప్రభావశీలత పెరుగుదలకు ఆలంబన అయ్యాయి. పాలనా వ్యవహారాలను మత ప్రాతిపదికన నడపడంతో ముస్లిం మత తీవ్రవాదుల కంటే హిందూ మత తీవ్రవాదులు ఎక్కువగా లబ్ధి పొందారు. రాజీవ్ ప్రభుత్వం అయోధ్యలోని వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తెరవడంతో ఆ మసీదును కూల్చివేసి దాని స్థానంలో రామాలయాన్ని నిర్మించేందుకు సంఘ్ పరివార్ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. 1984 సార్వత్రక ఎన్నికలలో కేవలం రెండే రెండు స్థానాలలో గెలిచిన బీజేపీ దశాబ్దంన్నర కాలంలో దేశంలో అగ్రగామి జాతీయ రాజకీయ పక్షంగా ఆవిర్భవించింది. బీజేపీ ప్రథమ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి పాలనా శైలిలో మెజారిటీవాద ప్రేరణలు ఉండేవి కావు. ఆయన పార్టీ అనేక సంకీర్ణ భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయవలసి ఉండడంతో ఆయన సంయమనంతో వ్యవహరించేవారు. సార్వత్రక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు మంచి మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ రెండో ప్రధానమంత్రి, మూడోసారి సాధారణ మెజారిటీని సాధించుకోలేకపోయినప్పటికీ పాలనా వ్యవహారాలలో 'హిందువులకే ప్రథమ ప్రాధాన్యం అజెండా'ను అమలుపరుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబంలోని ప్రస్తుత తరం నాయకుల కంటే బీజేపీ అగ్రనాయక ద్వయం నరేంద్రమోదీ, అమిత్ షాలే మరింతగా సైద్ధాంతిక నిబద్ధులు. అంతేకాదు, అధికారాన్ని గెలుచుకోవడం పైన, గెలుచుకున్న అధికారాన్ని నిలబెట్టుకోవడం పైన కాంగ్రెస్ నేతల కంటే వీరే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. మోదీ--షా ద్వయంతో పోలిస్తే రాజకీయాలలో రాహుల్, ప్రియాంకల ఆసక్తి, నిమగ్నత అస్థిరమైనది, అవ్యవస్థితమైనది. కాంగ్రెస్ కృశించి, క్షీణించిపోతుండగా, సంఘ్ పరివార్ ప్రభావ ప్రాబల్యాలు క్రమంగా పెరిగాయి, మరింతగా బలీయమవుతూ విస్తరిస్తున్నాయి. భారతదేశ నడుస్తున్న చరిత్రలో సువ్యక్తమవుతున్నది 'నాగరికతా పునరుజ్జీవనమే' నని హిందూ మితవాద సైద్ధాంతికులు తరచూ పెద్ద పెట్టున వాదిస్తున్నారు. ఈ వాదనలో ఇసుమంత సత్యం కూడా లేదు. భారతీయ కళలు, సంగీతం లేదా తాత్విక చింతనా ధోరణులు మహోన్నతమైనవి. వాటిని సమకాలీన ప్రపంచ సమస్యల పరిష్కారానికి వాటిని మరింత ఉపయుక్తంగా చేసే విషయంలో సంఘ్ పరివార్‌కు ఎటువంటి శ్రద్ధ లేదు. వారి శ్రద్ధాసక్తులు వేరే విషయాలలో ఉన్నాయి. హిందువులు కాని ఇతర భారతీయులు, ముఖ్యంగా ముస్లింల కంటే హిందువులే సమస్త జీవన రంగాలలోను అన్ని విధాల ఆధిక్యులు అన్న విషయాన్ని పదే పదే ప్రకటించడంపైన మాత్రమే శ్రద్ధ చూపుతున్నారు. నిజానికి మనం ఇప్పుడు చూస్తున్నది నాగరికతా పునరుజ్జీవనం కాదు. హిందూత్వ అజెండా ప్రేరేపిత కార్యాచరణే. నడుస్తున్న కాలంలో, మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ 2026లో భారత్ ఒక హిందూ పాకిస్థాన్‌గా ప్రభవించే సూచనలు సర్వత్రా కనిపిస్తున్నాయి. ఈ పరిణామాన్ని నివారించడం సాధ్యమవుతుందా? లౌకిక, మతపరమైనది కాని రాజ్యవ్యవస్థ భవిష్యత్తులో భద్రంగా వర్ధిల్లుతుందా? సమాధానాలు చెప్పడం అసాధ్యమైన ప్రశ్నలివి. అయితే ఇతర దేశాల అనుభవాలను పరిశీలించినప్పుడు మత విశ్వాసాలను రాజ్య వ్యవహారాలతో మిళితం చేయడమనేది ఎక్కడా సత్ఫలితాలనివ్వలేదని స్పష్టమవుతుంది. పాకిస్థాన్ తన అస్తిత్వానికి ఇస్లాంను కేంద్రంగా చేసుకున్నది. ఇది ఆ దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్య పాలనా పురోగతికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. లౌకికవాద ఆదర్శాలు పునాదిగా ప్రభవించిన బంగ్లాదేశ్ ఆ ఆదర్శాలను త్యజించింది. ఫలితంగా సంక్షోభం పాలై పలు విధాలా నష్టపోతోంది. ఒక అభివృద్ధి చెందిన దేశంగా వర్ధిల్లేందుకు ఆవశ్యకమైన ఆర్థిక, సాంస్కృతిక వనరులు ఇరాన్‌కు ఉన్నాయి. అయితే 1979లో మత ఛాందసవాద అయతొల్లాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు వమ్మయిపోయాయి.

## తరచూ బీర్ తాగుతున్నారా..? ఎన్ని అనర్థాలు సంభవిస్తాయో తెలుసా..?



వీకెండ్ వచ్చిందంటే చాలు యువత ఎక్కువగా బీర్ తాగుతూ వీకెండ్ వైబ్స్‌ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. బీర్ తాగడం సరదగా ఉన్నప్పటికీ ఇది మన ఆరోగ్యానికి గణనీయమైన హానిని కలిగిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చాలా మంది బీరే కదా అని తేలికగా తీసుకుంటూ ఉంటారు. కానీ బీర్ లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. బీర్ తాగడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఎముకలు బలహీనంగా తయారవుతాయి. 35 సంవత్సరాలు దాటిన తరువాత ఎముకల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళలు బీర్ తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతాయి. నెలసరి సమస్యలు రావడం, మానసికపరమైన సమస్యలు రావడం జరుగుతుంది. పురుషులు బీర్ తాగడం వల్ల వారిలో ఛాతి పెరుగుతుంది. టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గి ఈస్ట్రోజన్ స్థాయిలు పెరుగుతాయి. అంతే కాకుండా శరీరం శక్తి, పనితీరుతో పాటు ఆత్మవిశ్వాసం కూడా తగ్గుతుంది. బీర్ తాగడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య కూడా తలెత్తుతుంది. చాలా మంది బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నామని భావిస్తూ ఉంటారు. కానీ బీర్ వల్ల మన ఆరోగ్యానికి కలిగే హాని గురించి ఎవరూ ఆలోచించరు అని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా బీర్ తాగడం వల్ల మూత్రవిసర్జన పెరుగుతుంది. దీంతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. తలతిరగడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ లో ఉండే ఆల్కహాల్ పేగులో ఉండే పొరలను చికాకుకు గురి చేస్తుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు అధికం అవుతాయి. ఆమ్లత్వం పెరగడంతో పాటు పొట్టలో పుండ్లు కూడా ఏర్పడతాయి. బీర్ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీర్ఘకాలం పాటు బీర్ తాగడం వల్ల సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, ఆల్కహాలిక్ హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా మెదడు పనితీరు కూడా దెబ్బతింటుంది. అభిజ్ఞా పనితీరు క్షీణించడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. కనుక బీర్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. బీర్ తాగే అలవాటును ఒక్కసారిగా మానేయలేని వారు ఈ అలవాటును క్రమంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. బీర్ వంటి ఆల్కహాల్ కలిగిన పానీయాలను ఆరు నెలల పాటు తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంలో పెద్ద మార్పులను చూడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. బీర్ ను మానేయడం వల్ల మనం అనేక ఆరోగ్యప్రయోజనాలను పొందవచ్చని మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు చెబుతున్నారు.

# మీకు గోల్డెన్ మిల్క్ అంటే తెలుసా..?

## ఎలా తయారు చేయాలి..? ఏమేం లాభాలు కలుగుతాయి..?



మనం ఎంతో కాలంగా పసుపును ఆహారంలో భాగంగా తీసుకుంటున్నాం. పసుపులో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని దీనిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని మనందరికీ తెలుసు. వంటల్లో వాడడంతో పాటు పాలల్లో కూడా పసుపును కలిపి తీసుకుంటూ ఉంటాం. బంగారు పాలని కూడా ఈ పసుపు కలిపిన పాలను పిలుస్తారు. జలుబు, దగ్గు వంటి చిన్న చిన్న అనారోగ్య సమస్యలు రాగానే చాలా మంది పాలల్లో పసుపు కలిపి తీసుకుంటారు. శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడానికి , అనారోగ్య సమస్య నుండి బయటపడడానికి ఇలా తీసుకుంటూ ఉంటారు. పసుపు కలిపిన పాలను ఎందుకు తీసుకోవాలి.. దీనిని తీసుకోవడం వల్ల మనకు కలిగే ప్రయోజనాలు ఏమిటి.. అలాగే ఈ పాలను ఎలా తయారు చేసుకోవాలి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**జీర్ణ వ్యవస్థకు..**

దీర్ఘాకాలిక వాపు తీవ్ర అనారోగ్య పరిస్థితులకు దారి తీస్తుంది. పసుపులో ఉండే కర్కుమిన్ శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది వాపును, మంటను తగ్గించడంలో సహాయప డుతుంది. ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడే వారు పసుపు పాలను తీసుకోవడం వల్ల సమస్య నుండి ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా పసుపు పాలల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ నుండి శరీరాన్ని కాపాడడంలో సహాయపడతాయి. పసుసు పాలను తాగడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఈ పసుపు పాలల్లో దాల్చిన చెక్క పొడి, అల్లం రసం కలిపి తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు. గోరు వెచ్చని పాలల్లో పసుపు కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. అజీర్ణం, ఉబ్బరం వంటి లక్షణాలు తగ్గుతాయి.

**రోగ నిరోధక శక్తికి..**

క్రమం తప్పకుండా పసుపు పాలను తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్ లు మన దరి చేరకుండా ఉంటాయి. రాత్రి సమయంలో పసుపు పాలు తాగడం వల్ల నిద్ర నాణ్యత పెరుగుతుంది. నిద్రలేమి వంటి సమస్యలు తగ్గుతాయి. పసుపు పాలను తాగడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఆందోళన, నిరాశ లక్షణాలు తగ్గించడంలో ఈ పాలు మనకు ఎంతో సహాయపడతాయి. పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పాలను తాగడం వల్ల గుండె జబ్బు లు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

**గొంతు సమస్యలకు..**

ఇక చలికాలంలో ఈ పాలను తీసుకోవడం వల్ల మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ పాలను తీసుకోవడం వల్ల శరీరానికి వెచ్చదనం కలుగుతుంది.

చలికాలంలో గొంతునొప్పి వంటి సమస్యలు తరచూ వస్తూ ఉంటాయి. ఆ సమయంలో గోరు వెచ్చని పాలల్లో పసుపు కలిపి తాగడం వల్ల గొంతు నొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది. ఇక ఈ పాలను తయారు చేసుకోవడం కూడా చాలా సులభం. ఒక కప్పు పాలల్లో టీ స్పూన్ పసుపు వేసి కలపాలి. తరువాత చిటికెడు మిరియాల పొడి వేసి కలుపుతూ వేడి చేయాలి. వీటిని ఎక్కువగా మరిగించకూడదు. పాలు వేడెక్కిన తరువాత కప్పులోకి తీసుకుని రుచి కోసం తేనె కలిపి తీసుకోవచ్చు. ఈ విధంగా పసుపు పాలను తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

# మెంతులను వీటితో కలిపి తినండి..

## ఎన్నో లాభాలు కలుగుతాయి..!



మన వంటగదిలో ఉండే అనేక రకాల దినుసుల్లో మెంతులు కూడా ఒకటి. వీటిని మనం అనేక రకాల వంటకాల్లో వాడుతూ ఉంటాం. మెంతులు వేయడం వల్ల వంటలకు ఒక ప్రత్యేకమైన రుచి వస్తుంది. మెంతులను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో అనేక రకాల పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయి. ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. మెంతుల్లో కరిగే ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల కార్బొహైడ్రేట్స్ ను శరీరం నెమ్మదిగా శోషిస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. అంతేకాకుండా మెంతులల్లో 4-హైడ్రాక్సీఐసోలూసిన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. మెంతులను నానబెట్టి లేదా భోజనంలో కలిపి తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే ఇతర ఆహారాలతో కలిపి మెంతులను తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

**ఇన్సులిన్ సెన్సిటివిటీ..**

మెంతులను నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా దాల్చిన చెక్క పొడి కలిపి తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది, గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయి. దాల్చిన చెక్క కూడా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో మనకు సహాయపడుతుంది. దాల్చిన చెక్క పొడిని తీసుకోవడం వల్ల ఫాస్టింగ్ ప్లాస్మా గ్లూకోజ్ స్థాయిలతో పాటు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు, ట్రైగ్లిజరాయిడ్స్ కూడా తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. మెంతి గింజలను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం ఆ నీటిని తీసుకునే ముందు అందులో దాల్చిన చెక్క పొడి వేసి కలిపి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అదే విధంగా తాజా ఉసిరి రసంలో మెంతి గింజల పొడిని కలిపి తీసుకోవడం వల్ల మనం అనేక ఫలితాలను పొందవచ్చు. ఉసిరిలో విటమిన్ సితో పాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి పాంక్రియాటిక్ పనితీరును మెరుగుపరచడంలో, గ్లూకోజ్ జీవక్రియకు మద్దతు ఇవ్వడంలో సహాయపడతాయి. రోజూ ఒక గ్రాము ఉసిరి సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల గ్లూకోజ్, సీపిఆర్ సాంద్రతలు మెరుగుపడతాయి.

**అవిసె గింజలతో..**

ఇక అవిసె గింజలను, మెంతి గింజలను కలిపి తీసుకోవడం వల్ల చక్కెర శోషణ నెమ్మదిస్తుంది. భోజనం తరువాత చక్కెర స్థాయిల్లో వచ్చే హెచ్చుతగ్గులు తగ్గుతాయి. అవిసె గింజలను, మెంతులను కలిపి తీసుకోవడం వల్ల 24 గంటలకు పైగా రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా నమోదయ్యాయని పరిశోధనల్లో వెల్లడైంది. వీటిని కలిపి తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తక్కువగా ఉంటాయి. పాన్‌కేక్స్, మఫిన్స్ వంటి వాటి తయారీలో అవిసె గింజలను, మెంతులను వేసి తయారు చేసి తీసుకోవచ్చు. ఇలా తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చు. అలాగే పసుపును, మెంతులను కలిపి తీసుకోవడం వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.

**పసుపుతో..**

పసుపులోని కర్కుమిన్ ఇన్సులిన్ నిరోధకతను, హైపర్ గ్లైసీమియా, హైపర్ లిపిడెమియా వంటి మధుమేహ సంబంధిత సమస్యలపై సానుకూల ప్రభావాన్ని చూపిస్తుందని పరిశోధనల ద్వారా నిరూపితమైంది. గోరు వెచ్చని పాలల్లో లేదా నీటిలో పసుపు, మెంతి గింజల పొడి కలిపి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే వంటల్లో కూడా పసుపు, మెంతి గింజల పొడి వేసి తీసుకోవచ్చు. ఈ విధంగా మెంతి గింజలను ఇతర ఆహారాలతో కలిపి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

# గ్యాస్, అజీర్తి, మలబద్దకం.. అన్నింటికీ ఒకేసారి చెక్ పెట్టాలంటే.. ఇలా చేయండి..!



మారిన జీవన విధానం కారణంగా మనలో చాలా మంది జీర్ణ సమస్యల తో బాధపడుతున్నారు. గ్యాస్, అజీర్ణం, మలబద్దకం, ఉబ్బరం, ఆకలి లేకపోవడం వంటి వివిధ జీర్ణ సమస్యలతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్యలతో బాధపడుతున్నారు. క్రమరహిత భోజనం, ఫైబర్ లేని ఆహారం, నిద్రలేమి, వ్యాయామం లేకపోవడం వంటి వివిధ కారణాల వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యల బారి నుండి బయటపడడానికి చాలా మంది మందులను కూడా వాడుతున్నారు. పెద్ద వారితో పాటు పిల్లలు, యువత కూడా మందులను వాడే పరిస్థితి నెలకొంది. అయితే ఈ జీర్ణ సమస్యల ను తగ్గించుకోవడానికి మందులు వాడాల్సిన పని లేదని మన జీవనశైలిలో మార్పులు చేసుకుంటే సరిపోతుందని వైద్యులు చెబుతున్నారు. జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల మందులు వాడాల్సిన అవసరం లేకుండానే జీర్ణ సమస్యలు తగ్గుతాయని అలాగే భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటాయని వారు చెబుతున్నారు. జీర్ణసమస్యల నుండి బయటపడడానికి మన జీవనశైలిలో ఎటువంటి మార్పులు చేసుకోవాలో.. ఇప్పుడు తెలుసుకుందాం.

**డిజిటల్ తెరల వాడకం..**

గ్యాస్, ఉబ్బరం వంటి జీర్ణ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే రోజూ నిర్ణీత సమయానికి భోజనం చేయాలి. ఎప్పుడు పడితే అప్పుడు భోజనం చేయడం వల్ల గ్యాస్ సమస్య పెరుగుతుంది. మనం రోజూ ఒకే సమయానికి భోజనం చేయడం వల్ల శరీర అంతర్గత గడియారం జీర్ణ ఎంజైమ్ లను సరైన సమయానికి విడుదల చేస్తుంది. దీంతో ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, ఉబ్బరం, మలబద్దకం, ఆమ్లత్వం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. అలాగే తినేటప్పుడు టీవీ, సెల్‌ఫోన్ వంటి వాటిని చూడకూడదు. డిజిటల్ స్క్రీన్ లను చూడడం వల్ల మెదడు దృష్టి సరిగ్గా ఉండదు. దీంతో పేగులకు సంకేతాలు సరిగ్గా వెళ్లక ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక తినేటప్పుడు మన దృష్టి అంతా మన భోజనంపై ఉండేలా చూసుకోవాలి. జీర్ణ సమస్యలు రాకుండా ఉండాలంటే రాత్రి పూట త్వరగా నిద్రించడం కూడా అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఆలస్యంగా నిద్రించడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవ్వదు. దీంతో యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యల బారిన పడాల్సి వస్తుంది.

**ఫైబర్ ఉండే ఆహారాలను..**

మనం ఆహారం తీసుకోవడానికి, నిద్రించడానికి మధ్యలో 2 నుండి 3 గంటల సమయం ఉండడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది, శరీరం పోషకాలను సరిగ్గా గ్రహించుకుంటుంది. అలాగే మనం తీసుకునే ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, తృణ ధాన్యాలు, చిక్కుళ్లు వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి. ఫైబర్ కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల పేగులల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. మలబద్దకం సమస్య తగ్గుతుంది. ఆహారంలో ఫైబర్ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తానికి మేలు కలుగుతుంది. అదే విధంగా రోజూ ఉదయం మల విసర్జన తప్పకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఉదయంపూట మలవిసర్జన చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలి. మలవిసర్జన చేయడం వల్ల ఉబ్బరం, గ్యాస్ వంటి వాటితో పాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా రాకుండా ఉంటాయి.

**వ్యాయామం కూడా..**

జీర్ణ సమస్యలతో బాధపడే వారు ప్రతిరోజూ వ్యాయామం చేయడం అవసరం. వ్యాయామం చేయడం వల్ల జీర్ణవ్యవస్థతో పాటు మొత్తం శరీరానికి మేలు కలుగుతుంది. వ్యాయామం చేయడం వల్ల పేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. దీంతో అజీర్తి, గ్యాస్, మలబద్దకం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ విధంగా మన జీవనశైలిలో, మన ఆహారపు అలవాట్లల్లో మార్పులు చేసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తద్వారా జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని మందులు వాడే అవసరం కూడా ఉండదని వైద్యులు పేర్కొంటున్నారు.

# ఉదయాన్నే పరగడుపునే గోరు వెచ్చని నీటిని తాగుతున్నారా..?

## అయితే ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..!



నీరు మన శరీరానికి ఎంతో అవసరమన్న సంగతి మనందరికీ తెలిసిందే. శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు, రక్తప్రసరణకు, జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేయడానికి, శరీర జీవక్రియలకు నీరు ఎంతో అవసరం. రోజూ 8 నుండి 9 గ్లాసుల నీటిని తప్పకుండా మనం తాగాల్సిందే. అలాగే రోజూ మనం నీటిని తాగుతున్నప్పటికీ ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల మనకు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయి. ఇలా గోరు వెచ్చని నీటిని ఉదయం పూట తాగడం అందరికీ అలవాటుగా మారుతుందని కూడా చెప్పవచ్చు. ఉదయం పూట నీటిని తాగడం వల్ల అజీర్తి సమస్య తగ్గుతుందని చాలా మంది భావిస్తుంటారు. అయితే ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల నిజంగానే అజీర్ణ సమస్య తగ్గుతుందా.. ఇలా నీటిని తీసుకోవడం వల్ల శరీరానికి మేలు కలుగుతుందా.. ఇది అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందా.. దీని గురించి వైద్యులు ఏమంటున్నారో.. తెలుసుకుందాం.

**జీర్ణక్రియకు..**

ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల జీర్ణక్రియకు సహజ ఉద్దీపనగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల ఆహారం సమర్థవంతంగా విచ్ఛినం అవుతుంది. గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల పేగులకు రక్తప్రవాహం పెరుగుతుంది. జీర్ణక్రియ వేగంగా జరుగుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. కనుక ఉదయం పూట గోరువెచ్చని నీటిని తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు తెలియజేస్తున్నారు. అయితే మనం నీటిని తీసుకునే ఉష్ణోగ్రత, సమయం కూడా వీటిపై ఆధారపడి ఉంటాయని వారు చెబుతున్నారు. 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కలిగిన నీటిని పొట్ట చలనశీలత కోసం తీసుకోవడం మంచిది. 50 నుండి 60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కలిగిన నీటిని గ్యాస్, ఉబ్బరం, అజీర్తి వంటి లక్షణాలను తగ్గించడానికి తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కనుక ఉదయం తాగే నీరు 50 డిగ్రీల నుండి 60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత మధ్య ఉండేలా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**కిడ్నీల ఆరోగ్యానికి..**

ఇక ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల మనం తీసుకునే అల్పాహారం మరింత సమర్థవంతంగా విచ్ఛినం అవుతుంది. ఆమ్లత్వం తగ్గుతుంది. ఖాళీ కడుపుతో నీటిని తాగడం వల్ల ప్రేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. దీంతో మలబద్దకం సమస్య తగ్గుతుంది. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల మూత్రపిండాలు వ్యర్థాలను సమర్థవంతంగా బయటకు పంపిస్తాయి. శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. అంతేకాకుండా వేడి నీటిని తాగడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. అవయవాలకు ఆక్సిజన్ మరింత సమర్థవంతంగా అందుతుంది. వేడి నీటిని తాగడం వల్ల మనం సులభంగా బరువు కూడా తగ్గవచ్చు. ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరుగుతుంది. నిల్వ ఉన్న కొవ్వు వేగంగా కరుగుతుంది. క్యాలరీలు ఎక్కువగా ఖర్చు అవుతాయి. తద్వారా మనం వేగంగా బరువు తగ్గవచ్చు.

**బాగా వేడిగా ఉన్న నీటిని తాగితే..**


ఉదయం పూట వేడి నీటిని తాగడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మనం తాగే నీరు 60 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి లేకుండా చూసుకోవాలి. ఎక్కువ వేడి ఉన్న నీటిని తాగడం వల్ల నాలుక సున్నితమైన పొర దెబ్బతింటుంది. దంతాలపైఉండే ఎనామిల్ కాలక్రమేణా బలహీనపడుతుంది. వేడి నీరు కొందరిలో యాసిడ్ రిఫ్లెక్స్ ను పెంచుతుంది. అంతేకాకుండా వేడి నీటిని తాగడం వల్ల గొంతు చికాకు, బొంగురు గొంతు, గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంది. ఖాళీ కడుపుతో తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తాగడం వల్ల రక్తంలో సోడియం స్థాయిలు పలుచగా అవుతాయి. దీంతో వికారం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఉదయం పూట గోరు వెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి, జీర్ణ వ్యవస్థకు మంచిదే అయినప్పటికీ నీటిని తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను కూడా దృష్టిలో ఉంచుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# ఉపాధి హామీపై ఉక్కుపాదం



భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వీబీ జీ రామ్ జీగా మారుస్తూ కేంద్రం ఇటీవల కొత్త చట్టాన్ని తెచ్చింది. ఒక చట్టాన్ని రూపొందించేటప్పుడు విధివిధానాల రూపకల్పన సమగ్రంగా ఉండాలి. కానీ ఉన్న పథకానికి తూట్లు పొడుస్తూ తెచ్చిన కొత్త చట్టం నిరుపేదల పొట్టకొట్టడమే కాకుండా, రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతోంది. దేశంలో ఆకలిచావులు ఉండకూడదనే మానవతా దృక్పథంతో, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చొరవతో-- రెండు దశాబ్దాల క్రితమే మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, వలసలను తగ్గించింది. అంతేకాదు, ఉపాధికి చట్టపరమైన హామీ కల్పించడం ద్వారా ఇది కుటుంబ ఆదాయాన్ని పెంచి, మహిళా సాధికారతకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పడింది. గ్రామీణ పేదల పాలిట ఈ పథకం ఒక భద్రతా కవచంగా నిలుస్తోంది. ఇరవయ్యేళ్ల క్రితం- 2006, ఫిబ్రవరి 2న ఉమ్మడి రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బండ్లపల్లికి వచ్చి, ప్రధాని మన్మోహన్ స్వయంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. 'కాంగ్రెస్ అంటే ఉపాధి హామీ.. ఉపాధి హామీ అంటేనే కాంగ్రెస్' అనేలా నిరుపేదల గుండెల్లో ఈ పథకం చెరగని ముద్ర వేసింది. దానిని చెరిపివేసేందుకే మోదీ సర్కార్ అవకాశవాద రాజకీయాలకు తెరలేపింది. కొత్త చట్టం ద్వారా పని దినాలను 125కు పెంచడమే కాకుండా, రోజువారీ వేతనం పెంచుతున్నామని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్రం, ఉపాధి హామీ కార్మికులకు చెల్లించే వేతనాల ఖర్చులో 40శాతం భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై మోపాలనుకోవడం ఆక్షేపణీయం. గతంలో 90శాతం ఖర్చును కేంద్రం భరించగా, కేవలం 10శాతం మాత్రమే రాష్ట్రాలు భరించేవి. తెలంగాణ విషయానికి వస్తే.. 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనిదినాలను 8 కోట్ల నుంచి 6.5 కోట్లకు కేంద్రం కుదించింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ సర్కార్ 12 కోట్ల పనిదినాలు కోరితే, వాటిని సగానికి తగ్గించడమే కాకుండా రావాల్సిన నిధుల్లో కోత విధించడం గర్హనీయం. నిబంధనల పేరుతో కేంద్రం విధిస్తున్న ఆంక్షలు రాష్ట్ర ఉపాధి రంగాన్ని కుదిపేస్తున్నాయి. బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులను గణనీయంగా తగ్గించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలుకు అసాధ్యమైన నిబంధనలను రుద్దుతోంది. కొత్తగా ప్రవేశపెట్టిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా రోజుకు రెండుసార్లు ఫొటోలు తీయాలనే నిబంధన, సిగ్నల్ లేని మారుమూల ప్రాంతాల్లోని కూలీలకు శాపంగా మారింది. చిన్నపాటి సాంకేతిక కారణాలను సాకుగా చూపి, తెలంగాణకు రావాల్సిన వందల కోట్ల రూపాయల బకాయిలను కేంద్రం నిలిపివేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేసి, 'కల్లాలు' నిర్మించుకుంటే, దానిని నిబంధనల ఉల్లంఘనగా పేర్కొంటూ రూ.150 కోట్లకు పైగా నిధులను తిరిగి చెల్లించాలని రాష్ట్ర సర్కారుకు నోటీసులు ఇవ్వడం గమనార్హం. చెరువుల పూడికతీత, ఫీల్డ్ ఛానల్స్ వంటి పనుల ద్వారా రాష్ట్రం సాధించిన ప్రగతిని మెచ్చుకోవాల్సింది పోయి, రికవరీ నోటీసులు ఇవ్వడం తెలంగాణ రైతాంగాన్ని దెబ్బతీయడమే అవుతుంది. కేంద్రం నిర్ణయాల వల్ల తెలంగాణలోని దాదాపు 1.2 కోట్ల మంది జాబ్‌కార్డ్ హోల్డర్లు ప్రభావితమవుతున్నారు. ఆధార్ అనుసంధాన చెల్లింపుల కారణంగా సామాన్య కూలీలకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ కోణంలో కాకుండా, పేదల జీవనోపాధి కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. ఉపాధి హామీ పథకం పట్ల తాము అనుసరిస్తున్న కఠిన వైఖరిని సవరించుకోకపోతే మోదీ సర్కార్ భారీ మూల్యం చెల్లించుకోవడమే కాకుండా గ్రామీణ భారతం కోలుకోలేని దెబ్బతింటుందని కేంద్ర ప్రభుత్వ పెద్దలు గ్రహించాలి.

# పాక్‌కు బలూచ్ భయం




పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్సులో ఏకకాలంలో దాదాపు పన్నెండు జిల్లాల్లో బలూచ్ ఆర్మీ జరిపిన భీకరదాడుల్లో వందలాది ప్రాణాలు పోయాయి. 36మంది పౌరులు, 22మంది పాక్ భద్రతా సిబ్బంది ఈ దాడుల్లో మరణించారని, 192మంది బలూచ్ ఉగ్రవాదులను తాము మట్టుబెట్టామని పాక్ ప్రభుత్వం అధికారికంగా చెబుతున్నప్పటికీ, దాడుల తీవ్రత దృష్ట్యా సైనికుల మరణాలు అనేక రెట్లు ఉండవచ్చునని అంచనా. ఇప్పటికీ అక్కడక్కడ పరస్పరదాడులు జరుగుతున్నట్టుగా, ఇతర ప్రావిన్సుల నుంచి వచ్చిన పాకిస్థానీలమీద స్థానికులు విరుచుకుపడుతున్నట్టుగా వార్తలు వెలువడుతున్నాయి. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన నేపథ్యంలో, మంగళవారం ఐక్యరాజ్యసమితి కొన్ని పడిగట్టుపదాలతో ఈ ఘటనను ఖండించడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, బలూచ్ తిరుగుబాటు దారులను ఎదుర్కోవడం తమవల్ల కావడం లేదని పాకిస్థాన్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ జాతీయ అసెంబ్లీలో వ్యాఖ్యానించడం ద్వారా తమ పరువు తామే తీసుకున్నట్టు అయింది. విదేశీశక్తుల సాయంతోనే బలూచ్ ఆర్మీ రెచ్చిపోతోందని చెప్పుకోవడం పాక్ పాలకులకు క్షేమకరం. ఎవరో ఆర్థికసాయం చేస్తున్నారని, అత్యాధునిక ఆయుధాలు అందిస్తున్నారని అనడం ద్వారా తమ వైఫల్యాన్ని, నష్టాన్ని చక్కగా సమర్థించుకోవచ్చు. పాకిస్థాన్‌లోని అతిపెద్ద ప్రాంతంలో స్వల్పసంఖ్యలో ఉన్న ఈ టెర్రరిస్టుల దగ్గర ఒక్కొక్కటీ రెండుకోట్లు విలువచేసే అధునాతన రైఫిళ్ళు, మెషీన్‌గన్లు, నైట్‌విజన్ పరికరాలు, థర్మల్ వెపన్స్ వంటివి ఉన్నాయని, పాకిస్థాన్ సైన్యం దగ్గర ఆ స్థాయివి లేనేలేవని, అందువల్ల ఢీకొట్టడం కష్టమవుతోందని ఆయన వ్యాఖ్యల సారాంశం. బీఎల్ఏ నాయకత్వం అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నదని, ఆయుధాలు అమెరికావని ఆయన మాట్లాడారు. రెబెల్స్ విరుచుకుపడుతూంటే పాక్ ఆర్మీ పరుగులు తీస్తోందని సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న ప్రచారం ఆయనను ఇబ్బంది పెట్టడం సహజం. తిరుగుబాటుదారుల దెబ్బకు పాక్‌సైనికులు మిలటరీ క్యాంపులు వదిలేసి పారిపోతున్నారంటూ ఖాళీగా ఉన్న ఆ స్థావరాలు, సైనికదుస్తులు, వివిధ పరికరాలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి. సరైన సమన్వయంతో, ఏకకాలంలో, అనేక ప్రాంతాల్లో భయానక దాడులు జరిపి వందమందికి పైగా శత్రువులను మట్టుబెట్టామని బలూచ్ ఆర్మీ చెప్పుకుంటూంటే, పాక్ ఆర్మీ 'ఫిజికల్లీ హ్యాండీకాప్డ్' అయిపోయిందని స్వయంగా రక్షణమంత్రి చట్టసభలో అనడం విచిత్రం. బలూచ్ తిరుగుబాటుదారులకు భారత్ సహకరిస్తున్నదంటూ పాక్ పాలకులు విమర్శించడం, మనం ఖండించడం ఇప్పుడూ జరిగింది. ఇటీవలి కాలంలో బీఎల్ఏ ప్రతిఘటన స్థాయిలోనూ, తీవ్రతలో మార్పు వచ్చింది. పాక్ భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకొని రెబెల్స్ వివిధరకాల దాడులు చేస్తున్నారు. ఆత్మాహుతిదాడులు గతంలోనూ ఉన్నవే కానీ, మహిళలను అధికంగా వినియోగించడం పెరిగిందని అంటున్నారు. గతవారం జరిగిన దాడుల్లో ఇద్దరు మహిళలు ప్రధానపాత్ర పోషించారంటూ బలూచ్ ఆర్మీ వారి ఫోటోలను, వివరాలను, వీడియోలను సైతం విడుదల చేసి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. వనరులదోపిడీ, అణచివేతను ఎదుర్కోవడానికి తమవారు నవ్వుతూ ప్రాణాలు వదిలేస్తున్నారంటూ ఆ సంస్థ చెప్పుకుంటోంది. మొత్తం పాకిస్థాన్‌లో నలభైశాతం భూభాగం ఉన్న ఈ ప్రావిన్సుని ఎందుకు అదుపుచేయలేపోతున్నామో పాకిస్థాన్ పాలకులు ఆలోచించాలి. అత్యంత విలువైన ఖనిజ సంపదతోపాటు, చమురు, సహజవాయువు, బంగారం ఇత్యాది భారీ నిల్వలున్న ఈ ప్రాంతాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పాక్ పాలకులు ఆదినుంచీ వ్యవహరిస్తున్నారు. గనుల నిర్వహణతో పాటు, గ్వాదర్ నౌకాశ్రయాన్ని కూడా చైనా చేతుల్లో పెట్టి, అక్కడివరకూ చైనా--పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను నిర్మించుకొనేందుకు అనుమతించి బలూచ్‌లను మరింత రెచ్చగొట్టారు. బలూచిస్థాన్‌ను బలవంతంగా విలీనం చేసుకున్న పాకిస్థాన్ దానిని ఎన్నడూ తనది అనుకోలేదు. పాక్షిక స్వయంపాలనకు సైతం అనుమతించకుండా, ప్రజలు ఎన్నుకున్నవారిని కూలదోసి, తమ అనుకూలురని ప్రతిష్ఠించి, సైన్యంతో దానిని ఏలేందుకు ప్రయత్నించడమే ఈ పరిస్థితికి కారణం. పదేళ్ళకాలంలో పదివేలమంది బలూచ్‌లను మాయం చేసిన ఘనత పాక్ పాలకులది. గత ఏడాది మార్చిలో ఏకంగా ఒక రైలునే హైజాక్ చేసిన బలూచ్ ఆర్మీ, ఇటీవలి దాడితో తన శక్తిసామర్థ్యాలు మరింత హెచ్చినట్టుగా ప్రపంచానికి చాటగలిగింది.

## షుగర్, అధిక బరువు సమస్యలతో బాధపడుతున్నారా..?

**అయితే ఫైబర్ అధికంగా ఉండే ఈ ఆహారాలను తీసుకోండి..!**



డయాబెటిస్ తో బాధపడే వారు ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. వారు తీసుకునే ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచేలా, శరీరానికి శక్తిని, పోషకాలను అందించేదిగా ఉండాలి. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉండాలంటే ఎక్కువగా ఫైబర్ ఉండే ఆహరాలను తీసుకోవాలి. ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచవచ్చు. ప్రాసెస్ చేసిన ఆహారాల లాగా కాకుండా ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా అడ్డుకుం టుంది. గ్లూకోజ్ శోషణ నెమ్మదించేలా చేస్తుంది. ఇక ఫైబర్ లో కూడా కరిగే ఫైబర్, కరగని ఫైబర్ రెండు రకాలు ఉన్నాయి. డయాబెటిస్ ఉన్న వారు రోజుకు 22 నుండి 35 గ్రాముల ఫైబర్ ను తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఫైబర్ ను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది, శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు తీసుకోదగిన ఫైబర్ అధికంగా ఉండే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**అవకాడో, బెర్రీ పండ్లు..**

డయాబెటిస్ తో బాధపడే వారు అవకాడోను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. దాదాపు 100గ్రాముల అవకాడోలో 6.7 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఫైబర్ తో పాటు అవకాడోలో ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు కూడా ఉంటాయి. ఈ కొవ్వులు ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎంతో సహాయపడతాయి. మధుమేహంతో బాధపడే వారికి అవకాడో ఒక మంచి పండు అని చెప్పవచ్చు. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ వంటి పండ్లల్లో చక్కెరలు తక్కువగా ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. 100గ్రాముల రాస్ప్‌బెర్రీల్లో 6.5 గ్రాముల ఫైబర్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అదేవిధంగా పియర్స్‌ను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. వీటిని తొక్కతో తీసుకోవడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చు. మధ్యస్థంగా ఉండే ఒక పియర్ పండును తినడం వల్ల దాదాపు 6 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. మధుమేహ నిర్వహణకు ఈ పండు ఎంతో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

**బ్రోకలీ, పచ్చి బఠానీలు..**

ఇక డయాబెటిస్ తో బాధపడే వారు బ్రోకలీని కూడా తీసుకోవచ్చు. ఒక కప్పు బ్రోకలీలో 2.2 గ్రాముల ఫైబర్ ఉంటుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా అధికంగా ఉంటాయి. క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కనుక బ్రోకలీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి, శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. పచ్చిబఠాణీల్లో కూడా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఒక కప్పు పచ్చిబఠాణీలలో దాదాపు 8.8 గ్రాముల ఫైబర్ ఉంటుంది. కనుక భోజనంలో వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి. అదే విధంగా డయాబెటిస్ ఉన్న వారు ఓట్స్ ను, బార్లీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది గ్లూకోజ్ శోషణను, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక కప్పు ఉడికించిన బార్లీలో 6 గ్రాములు, అరకప్పు ఓట్స్ లో 4 గ్రాముల ఫైబర్ ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. చక్కెర స్థాయిలల్లో వచ్చే హెచ్చుతగ్గులు రాకుండా నివారించవచ్చు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

## కలుపు మందు వాడేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట్ గ్రామంలో వరి పంట పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలో కలుపు మందులు వినియోగించే సమయంలో తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పొలంలో నీటి మట్టం 2-3 సెంటీమీటర్లు మించకూడదు. కలుపు మందు వాడిన తర్వాత 48 నుండి 72 గంటల వరకు పొలంలోని నీటిని తీసివేయకూడదని చెప్పారు. అలాగే కలుపు ఎక్కువగా ఉందని కారణంగా మోతాదును పెంచరాదు అని సూచించారు. నాట్లు వేసిన 3-5 రోజుల దశలో, పలుచగా నీరు పెట్టి ఎకరాకు? 500 మి.లీ. ప్రెటిలాక్లోర్ లేదా 1లీ. బ్యూటాక్లోర్ ను 20 కిలోల ఇసుకతో కలిపి పొలంలో సమానంగా చల్లాలి. గుళిక రూపంలో ఉపయోగించాలనుకుంటే ఎకరాకు 4కిలోల బెన్సల్ఫ్యూరాన్ మిథైల్ ० ప్రెటిలాక్లోర్ లేదా? పైరజోసల్ఫ్యూరాన్ ప్రెటిలాక్లోర్ గుళికలను ఉపయోగించాలి. నాట్లు వేసిన 20-25 రోజుల దశలో, కలుపు3-5ఆకుల దశలో ఉన్నప్పుడు మందులు సమర్థవంతంగా పనిచేస్తాయి. పొలంలో ఏ రకమైన కలుపు ఉందో గుర్తించి దానికి అనుగుణంగా మందులు వాడాలి. ఏ కలుపు మందు కూడా 100% కలుపును పూర్తిగా నివారించదు. మందు వేసిన తర్వాత మిగిలిన కలుపును చేతితో తొలగించాలి.



## మూడు కాలాల్లో సాగే కథ

'ఇండియాలో తొలి మోటోక్రాస్ ఫిల్మ్ 'బైకర్'. చాలా కొత్తకథ. దర్శకుడు అభిలాష్ ఫ్రెష్ కంటెంట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాడు. ఇది హై అడ్రినలిన్, హై ఆక్టేన్ ఫిల్మ్. ఇది నాకు వినగానే నచ్చిన కథ. అందుకే రిజల్ట్ కోసం ఎక్సైటెడ్‌గా ఉన్నాను' అని కథానాయిక మాళవిక నాయర్ అన్నారు. శర్వానంద్‌కు జోడీగా ఆమె నటించిన చిత్రం 'బైకర్'. డా.రాజశేఖర్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రానికి అభిలాష్‌రెడ్డి దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 3న విడుదల కానుంది. మాళవిక నాయర్ బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'కథకు వంతెనలాంటి పాత్రలో నేను కనిపిస్తాను. ఈ కథ మూడు కాలాల్లో సాగుతుంది. ప్రతి కాలంలోనూ నా పాత్ర ఇన్వాల్వ్‌మెంట్ ఉంటుంది' అని చెప్పింది మాళవిక నాయర్. ఇందులో తండ్రీకొడుకుల ఎమోషన్ ప్రత్యేకంగా ఉంటుందని, అద్భుతమైన ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమా ఇదని మాళవిక పేర్కొన్నారు. సాంకేతికంగా అన్ని విధాలా 'బైకర్' ఆకట్టుకుంటుందని, ఒక్క మాటలో చెప్పాలంటే స్ఫూర్తినిచ్చే ఉత్కంఠభరిత చిత్రం 'బైకర్' అనీ మాళవిక నాయర్ అన్నారు.

ఇకపై పర్సంటేజీ విధానంలో ప్రదర్శనలు..

## తెలంగాణ ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం



తెలంగాణ సినీ ఎగ్జిబిటర్ల సుదీర్ఘ కాల డిమాండ్‌కు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. అద్దె విధానానికి స్వస్తిపలికి పర్సంటేజీ విధానంలో సినిమాల్ని ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం దిశగా గురువారం కీలక పరిణామం చేటుచేసుకుంది. అద్దె విధానాన్ని రద్దు చేస్తూ మల్టీప్లెక్స్‌ల తరహాలో ఇకపై పర్సంటేజీ ఆధారిత రెవెన్యూ విధానంలో సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్ నగరంలోని 23 సింగిల్‌స్క్రీన్ల థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఏప్రిల్ 3 నుంచి ఈ విధానం అమలులోకి రానుందని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దీని ప్రకారం సినిమా ప్రదర్శితమైన తొలివారం 60శాతం, రెండోవారం 50శాతం, మూడోవారం నుంచి 40 శాతం ఎగ్జిబిటర్లకు సినిమా వసూళ్లలో వాటా దక్కనుంది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను సంప్రదించి డిస్ట్రిబ్యూటర్లతో చర్చలు జరిపారు. హైదరాబాద్‌లోని 23 ప్రీమియం సింగిల్ స్క్రీన్లలో ప్రేక్షకులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నామని, థియేటర్ల నిర్వహణకు పెద్ద మొత్తంలో ఖర్చు పెడుతున్నామని ఎగ్జిబిటర్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న అద్దె విధానంలో నిర్వహణ కష్టమవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో పర్సంటేజీ ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శించాలన్న ఎగ్జిబిటర్ల అభ్యర్థనను డిస్ట్రిబ్యూటర్లు అంగీకరించారు. నగరంలోని 23 థియేటర్లే కాకుండా తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్‌లలో విడతల వారిగా పర్సంటేజీ విధానాన్ని అమలుపరుస్తామని ఎగ్జిబిటర్లు తెలిపారు. మార్చి 11న బెంగళూరులో జరిగిన దక్షిణ భారత ఎగ్జిబిటర్ల సమావేశంలో కూడా పర్సంటేజీ విధానంపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారని, తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని సింగిల్ స్క్రీన్లు పర్సంటేజీ విధానాన్ని అనుసరిస్తున్నాయని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ తెలియజేసింది.

## జానపద కథలాంటి సినిమా..




సంగీత్‌శోభన్, నయన్‌సారిక జంటగా నటించిన చిత్రం 'రాకాస'. మానసశర్మ దర్శకురాలు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. గ్లింప్స్ నుంచే ఈ సినిమాపై భారీ హైప్ ఏర్పడిందని, ఆద్యంతం హాస్యప్రధానంగా సాగే చిత్రమిదని, ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేస్తారని చిత్ర నిర్మాత నిహారిక కొణిదెల చెప్పింది. ఫాంటసీ, అడ్వెంచర్, ఫన్ కలబోసిన సినిమా ఇదని, రామ్‌చరణ్ ఈ సినిమా గురించి గొప్పగా మాట్లాడటం ధైర్యాన్నిచ్చిందని హీరో సంగీత్‌శోభన్ అన్నారు. మన జానపద కథలు ఈ తరం వారు అర్థం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశామని, అందమైన చందమామ కథలా ఆకట్టుకుంటుందని దర్శకురాలు మానసశర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురురోలు, సంగీతం: అనుదీప్‌దేవ్, నిర్మాతలు: నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సాల్, రచన-దర్శకత్వం: మానసశర్మ.



## డెకాయిట్ ప్రేమగాథ

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న క్రైమ్ డ్రామా 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, సెన్సార్ పూర్తయిందని, యు.ఏ. సర్టిఫికెట్ లభించిందని మేకర్స్ తెలిపారు. 13 ఏళ్ల విరామం తర్వాత కలుసుకున్న మాజీ ప్రేమికుల జీవన ప్రయాణానికి అద్దం పట్టే చిత్రమిదని, హృద్యమైన ప్రేమకథ.. ఇంటెన్స్ యాక్షన్ కలబోతగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని దర్శకుడు పేర్కొన్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచాయని, అడివి శేష్ పాత్రలో భిన్నకోణాలుంటాయని ఆయన అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## డిసెంబర్‌లో ఫౌజీ?



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న దేశభక్తి ప్రధాన చిత్రం 'ఫౌజీ'. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. ఇందులో ప్రభాస్ బ్రిటీష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు దేశభక్తి, ప్రేమ, త్యాగం అంశాలతో ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ పాన్ ఇండియా సినిమా విడుదల గురించి ప్రభాస్ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆగస్ట్ 15న రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారని వార్తలొచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా 70 శాతం చిత్రీకరణ పూర్తచేసుకుంది. మంచి క్వాలిటీ అవుట్‌పుట్‌ను దృష్టిలో పెట్టుకొని పోస్ట్‌ప్రొడక్షన్ కోసం మరింత సమయాన్ని వెచ్చించే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. రిలీజ్ డేట్‌కు సంబంధించిన వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103